సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
ఆదివారం, 04.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 334
పేజీలు: 08 వెల: రూ. 5


# టీమిండియా బంగారం

ఆసియా క్రీడల్లో స్వర్ణం నిలబెట్టుకున్న భారత్



- పాక్‌పై 19 పరుగులతో భారత్ ఘన విజయం
- 20 బంతుల్లోనే అభిషేక్ శర్మ అర్ధశతకం
- 21 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదిన తిలక్ వర్మ
- 96 పరుగులు చేసిన హసన్ నవాజ్

02

**బీజేపీ VS బీఆర్ఎస్**

## కాంగ్రెస్‌కే లాభమా?

### బీజేపీ బీఆర్ ఎస్ పొత్తు లేనట్లేనా?!

- బీజేపీ–బీఆర్ఎస్ పొత్తుపై మళ్లీ జోరుగా చర్చ
- పొత్తు లేదంటున్నా.. ఆగని రాజకీయ ప్రచారం
- కాంగ్రెస్‌కు లాభమా? విపక్షాల్లో ఓట్ల చీలిక
- బీజేపీతో పొత్తు ఉండదన్న కేటీఆర్
- బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదన్న కిషన్ రెడ్డి
- తెలంగాణ రాజకీయాల్లో పొత్తులపై ఆసక్తికర చర్చ
- ఎన్నికలకు రెండేళ్లు.. అప్పుడే పొత్తులపై రచ్చ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ–బీఆర్ఎస్ పొత్తు అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ.. ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయన్న ప్రచారం మాత్రం రాజకీయ వర్గాల్లో తరచూ చర్చకు వస్తోంది. అయితే బీజేపీ, బీఆర్ఎస్ అగ్ర నేతలు మాత్రం పొత్తు ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రచారం ఆగకపోవడం ఆసక్తికరంగా మారింది.

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. బీఆర్ఎస్, బీజేపీలు ప్రధాన ప్రతిపక్షాలుగా ఉన్నాయి. సాధారణంగా త్రిముఖ పోరు జరిగితే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోయే అవకాశం ఉంటుంది. దీంతో అధికార పార్టీకి రాజకీయంగా ప్రయోజనం కలిగే అవకాశాలు ఉంటాయన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇదే నేపథ్యంలో 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలంటే విపక్షాల మధ్య ఓట్ల చీలికను నివారించాల్సిందేనన్న చర్చ మొదలైంది.

**కాంగ్రెస్‌కు ఇదే అస్త్రం**

బీజేపీ–బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ నేతలు చాలా కాలంగా ఆరోపిస్తూ వస్తున్నారు. ఎన్నికల సమయానికి ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకుంటాయని కూడా పలువురు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఒకవేళ 2 పార్టీలు కలిసి వచ్చినా.. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎదుర్కొని తాము మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో బీజేపీ–బీఆర్ఎస్ పొత్తు అంశం కాంగ్రెస్ ప్రచారంలోనూ కీలకంగా మారింది.

**పొత్తు ఉండదన్న కిషన్ రెడ్డి**

అయితే బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి పొత్తు ప్రచారానికి తెరదించారు. బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని చెప్పారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలే కాకుండా ఏ ఎన్నిక అయినా పార్టీ సొంత బలంతోనే ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. 2028లో కూడా ఒంటరి పోటీతో గెలుస్తామంటున్నారు. **మిగతా 02లో**



**సీజేపీ**

# నిరసన

- సీజేపీ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు
- ముంబై శివాజీ పార్క్‌లో సీజేపీ నిరసన
- సీజేపీ నిరసనను ముంబైలో లోకల్స్ అడ్డగింత..
- సీజేపీపై పోలీస్ యాక్షన్.. కేసుల నమోదు!
- ఢిల్లీ, ముంబైలో సీజేపీపై పోలీస్ యాక్షన్‌తో ఉద్రిక్తత

## ఢిల్లీలోని జంతర్ మంత్ వద్ద సీజేపీ భారీ ఆందోళన..

**ముద్ర, న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు దేశ రాజధాని ఢిల్లీ నుంచి ముంబై వరకు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. ఒకవైపు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు దిగిన నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకోగా.. మరోవైపు ముంబైలో శివాజీ పార్క్ వేదికగా సీజేపీకి ఊహించని పరిణామం ఎదురైంది. నిరసనకు వచ్చిన సీజేపీ బృందాన్ని స్థానికులు అడ్డుకోవడంతో 'సీజేపీ వర్సెస్ ముంబై జెన్ జెడ్' అన్న కొత్త చర్చ తెరపైకి వచ్చింది.

**శివాజీ పార్క్‌లో లోకల్స్ ఝలక్!**

అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో భారీ నిరసన నిర్వహించేందుకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చింది. అయితే ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినప్పటికీ సీజేపీ నేతలు, మద్దతుదారులు శివాజీ పార్క్‌కు చేరుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. సీజేపీ బృందం పార్క్‌లోకి చేరుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలో కొందరు స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. "శివాజీ పార్క్‌లో అడుగు పెట్టనివ్వం.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి" అంటూ వారు నిరసనకారులను ప్రశ్నించారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం మరింత ముదిరింది. అయితే తమను వ్యతిరేకిస్తున్న వారంతా నిజంగా స్థానికులేనా? లేక తమ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా పంపించారా? అని సీజేపీ నేతలు అనుమానం వ్యక్తం చేశారు. **మిగతా 02లో**





విజయవాడలో

## పాన్ ఐఐటీ సమ్మిట్

ఆవిష్కరణలను పరిశీలించిన సీఎం చంద్రబాబు..

- అమరావతి నుంచే భారత్ మోడల్: లోకేశ్
- ఏపీలో టెక్నాలజీకి పెద్దపీట.. పెట్టుబడుల కోసం 23 క్లస్టర్లు
- రాష్ట్ర అభివృద్ధిలో పాన్ ఐఐటీ మార్గదర్శకత్వం అవసరం

02

# కేసీఆరే సీఎం!

కొత్త చర్చకు తెర లేపిన కేటీఆర్



- 2028లో కేసీఆర్‌నే సీఎం చేస్తాం: కేటీఆర్
- తాను సీఎం అభ్యర్థిని కాదన్న కేటీఆర్
- గులాబీ పార్టీలో సీఎం చర్చకు కేటీఆర్ ఫుల్‌స్టాప్?
- కేసీఆర్ నాయకత్వంలోనే 2028 ఎన్నికలు!
- రేవంత్‌కు చెక్ పెట్టేందుకే కేసీఆర్‌ను ముందు పెడుతున్నారా?
- కేసీఆర్ తర్వాత కేటీఆర్‌దే పీఠం? ఆసక్తికర చర్చ
- 2028లో కేసీఆర్.. ఆ తర్వాత కేటీఆర్?

02



శ్రీసిటీలో బాయిలర్ పేలి

## మంటలు

02

- ఐదుగురు కార్మికులు మృతి..!
- మరికొంత మందికి గాయాలు

22ఏ భూములపై

## కీలక నిర్ణయం

నాలా రుసుముతో పట్టాభూముల రిజిస్ట్రేషన్లు

- 22ఏ భూ సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు
- కలెక్టర్లకు ప్రభుత్వం కీలక మార్గదర్శకాలు
- అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్

02

ట్యాంక్‌బండ్‌పై

## సద్దుల బతుకమ్మ

18న ట్యాంక్‌బండ్‌పై నిర్వహణ

- 10 నుంచి బతుకమ్మ సంబరాలు
- అమరవీరుల స్థూపం నుంచి భారీ ర్యాలీ
- రవీంద్రభారతిలో 10 రోజుల ఉత్సవాలు
- బతుకమ్మకు స్పెషల్ లోగో..
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ అంశంతో ప్రత్యేక లోగో రూపకల్పన

02






మాకు

## గర్వకారణం

స్మిత్ మచ్చర్‌కు దుబాయ్ యువరాజు ఆత్మీయ ముద్దు



- స్మిత్‌కు హమ్దాన్ ఆత్మీయ పరామర్శ
- పైలట్‌పై ప్రశంసలు
- ఆసుపత్రిలో స్మిత్‌ను కలిసిన దుబాయ్ యువరాజు
- సాహసోపేత పైలట్‌కు యువరాజు అభినందనలు
- వేగంగా కోలుకుంటున్న కెప్టెన్ స్మిత్

02

**ఇదీ AI ముద్ర**

## ఏఐకి ఎథిక్స్.. హిందూ సాధువుతో ఆంథ్రోపిక్ చర్చలు



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
ఆదివారం, 04 అక్టోబర్, 2026
2
జనరల్ న్యూస్
General NEWS

**మజ్జిగ: శరీరాన్ని చల్లగా ఉంచుతుంది**
వేసవిలో మజ్జిగ తాగడం వల్ల శరీరానికి ద్రవాలు అందడంతో పాటు వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది. డీహైడ్రేషన్‌ను నివారించడంలోనూ ఇది సహాయపడుతుంది.



# టీమిండియా బంగారం

**ముద్ర, ఢిల్లీ:**
ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత జట్టు మరోసారి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో 19 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ (61), తిలక్ వర్మ (51 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో భారత్ 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాక్ 192/6 స్కోరుకే పరిమితమైంది. హసన్ నవాజ్ (96 పరుగులు) ఒంటరి పోరాటం చేసినా.. పాక్‌ను గెలిపించలేకపోయాడు. హసన్ నవాజ్ చివరి బంతికి అవుటయ్యాడు.



**అభిషేక్ మెరుపులు.. తిలక్ దూకుడు**
టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. పాక్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 20 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. దీంతో పాక్‌పై టీ20ల్లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. గతంలో 2025లో దుబాయ్‌లో 24 బంతుల్లో సాధించిన తన రికార్డునే అధిగమించాడు. అభిషేక్ 28 బంతుల్లో 61 పరుగులు చేశాడు. ఇందులో మూడు ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. ఆ తర్వాత తిలక్ వర్మ తనదైన శైలిలో చెలరేగాడు. కేవలం 21 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. శివమ్ దూబేతో కలిసి ఆరో వికెట్‌కు 62 పరుగులు జోడించాడు. దీంతో భారత్ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

**హసన్ పోరాటం వృథా**
212 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్‌కు హసన్ నవాజ్ అండగా నిలిచాడు. భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ 51 బంతుల్లోనే 96 పరుగులు చేశాడు. సైమ్ అయూబ్ (29) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీసి పాక్ పరుగుల వేగానికి అడ్డుకట్ట వేశారు. చివర్లో శివమ్ దూబే కూడా రెండు వికెట్లు పడగొట్టడంతో పాక్ 20 ఓవర్లలో లక్ష్యానికి 19 పరుగుల దూరంలో నిలిచిపోయింది. దీంతో భారత్ స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఆసియా క్రీడల క్రికెట్లో మహిళల స్వర్ణం కూడా భారత్ ఖాతాలో చేరడం తెలిసిందే. ఇప్పుడు పురుషుల టీమ్ కూడా ఫైనల్లో గెలవడంతో భారత్ గోల్డెన్ డబుల్ సాధించినట్టయింది.

## 22ఏ భూములపై ప్రభుత్వం
# కీలక నిర్ణయం

**ముద్ర, హైదరాబాద్ :**
రాష్ట్రంలో 22ఏ భూముల సమస్యల పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టాభూముల రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించింది. నాలా రుసుము చెల్లిస్తే అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు చేయాలని తీర్మానించింది. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను కాలపరిమితిలో పరిష్కరించా లని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. 22ఏ భూ సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఐదు జీవోలు జారీ చేసింది. ఈ సమస్య పరిష్కారంపై అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు ఉన్న 22ఏ ఇళ్లు, ఫ్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి మంజూరు చేసింది. కొని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారానికి ఉత్తర్వులు జారీ చేసింది.

# మాకు గర్వకారణం

**ముద్ర, న్యూఢిల్లీ :**
ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రస్తుతం యూఏఈలోని అబుధాబీలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆయన వేగంగా కోలుకుంటున్నారని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ''భారత ధైర్యశాలి కెప్టెన్ స్మిత్ మెరుగైన వైద్య సంరక్షణలో ఉన్నారు. వేగంగా కోలుకుంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నాం. యూఏఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు'' అని భారత ఎంబసీ తెలిపింది. మరోవైపు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ పరామర్శించారు. ''ప్రయాణికుల ప్రాణాల విషయంలో అత్యంత ధైర్యసాహసాలు కనబర్చిన పైలట్‌ను పరామర్శించాను. ఆయన మా బృందంలో, దేశ చరిత్రలో ఒక భాగం. యూఏఈ ఆశయాలకు ప్రతీకగా నిలవడం మాకు గర్వకారణం'' అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.



# కేసీఆరే సీఎం!

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
బీఆర్ఎస్‌లో సుప్రీం లీడర్ కేసీఆర్ అన్న సంగతి అందరికీ తెలిసిందే. అదే సమ యంలో ఆయన తరువాత వారసుడిగా కేటీఆర్ కి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆయన ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉంటున్నారు. పార్టీలో దైనందిన వ్యవహారాలు అన్నీ ఆయనే చూస్తున్నారు. ఇక హరీష్ రావు కూడా మరో అగ్ర నేత గా గులాబీ పార్టీలో ఉన్నారు. ఈ ముగ్గురితోనే బీఆర్ఎస్ ఉంది. మిగిలిన నాయకులు సీనియర్లు ఎంత మంది ఉన్నా బీ ఆర్ఎస్ అనే రథానికి సారథులు వీరే అన్నది నిజం. ఇదిలా ఉంటే 2028 ఎన్ని కల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తే కేటీ ఆర్ సీఎం అవుతారు అన్న ప్రచారం ఆ మధ్య దాకా సాగింది. అయితే ఇపుడు ఆ పార్టీ పొలిటికల్ టోన్ మారింది. కేసీ ఆరే సీఎం అని గట్టిగానే ఈ మధ్య కాలంలో ప్రచారం చేస్తున్నారు.

**క్లారిటీ ఇచ్చిన కేటీఆర్**
ఇక కేరళలోని కొచ్చిలో జరిగిన ఇండి యాటు డే కాంక్లేవ్ సౌత్ 2026లో కేటీ ఆర్ తాను సీఎం అభ్యర్థిని కాను అంటూ పక్కాగా క్లారిటీ ఇచ్చేశారు. 2028 లో తెలంగాణాలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా కేసీఆర్ ఉంటారని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ కాంక్లేవ్ లోకేటీఆర్ కి కీలక ప్రశ్న ఎదురైంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున మీరే సీఎం అభ్యర్థా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిస్తూ తాను అయితే ఖచ్చితంగా కానే కాదు అని కుండబద్దలు కొట్టారు. రాబోయే ఎన్నికల్లో మా పార్టీ సీఎం అభ్యర్థి కేసీఆర్ అన్నారు.

**రెండేళ్లలో సీఎంగా**
తెలంగాణాలో రెండేళ్లలో జరిగే ఎన్నిక ల్లో సీఎంగా తిరిగి కేసీఆర్ ప్రమాణం చేస్తారు అని కేటీఆర్ జోస్యం చెప్పారు. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలలో విపరీతమైన వ్యతిరేకత ఉందని విశ్లేషించారు. అందువల్ల రాబో యే రెండేళ్లలో జరిగే ఎన్నికలలో బీఆ ర్ఎస్ విజయం సాధిస్తుందని అలా తన నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని ధీమాగా చెప్పారు. తాను మాత్రం ముఖ్యమంత్రిని కాను అని చెప్పారు. దీంతో బీఆర్ఎస్ లో సీఎం ఎవరు అన్న దానికి కేటీ ఆర్ ఫుల్ స్టాప్ పెట్టారా లేక కొత్త చర్చకు తెర తీశారా అన్నదే అంతా విశ్లేషిస్తున్నారు.

**అలా అందుకుంటారా**
కేటీఆర్ సీఎం అభ్యర్థి అని ఇప్పటికే బీఆ ర్ఎస్ లో నాయకత్వం క్యాడర్ చాలా వరకూ ఫిక్స్ అయి ముందుకు సాగుతోంది. అయితే కేసీ ఆర్ సీఎం అని కేటీఆర్ చెప్పడంతో వారంతా ఇపుడు ఏ విధంగా ఆలోచిస్తారు అన్నది చర్చగా ఉంది. అయితే బీఆర్ఎస్ వ్యూహాత్మకంగానే ఇలా చేస్తోందంటున్నారు. రేవంత్ రెడ్డిని ఢీ కొట్టాలీ అంటే కేసీఆర్ సరైన వారు అని ఆయన్ని ముందు పెడుతున్నారని అంటున్నారు. పైగా తెలంగాణా తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ కి ఇమేజ్ ఉంది. దాంతో ఆయన నాయకత్వంలో ఎన్నికలకు వెళ్తేనే బీఆర్ఎస్ కి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని లెక్క వేస్తున్నారు మరి కేటీఆర్ సీఎం ఎపుడు అంటే ఒక్కసారి పార్టీ అధికారం దక్కించుకున్నాక అయిదేళ్ల పాటు పవర్ చేతిలో ఉంటుంది. దాంతో ఆ తరువాత ఎన్నో మార్పులు చేర్పులు జరగవచ్చు అని అంటున్నారు. అంటే ఒకవేళ కేటీఆర్ చెప్పినట్లుగా కేసీఆర్ 2028 లో సీఎం అయినా ఎక్కువ కాలం ఆయన ఆ సీటులో ఉండకపోవచ్చు. మధ్యలోనే కేటీఆర్ కి పట్టాభిషేకం జరగవచ్చు అన్నది కూడా ఊహాగానాలుగా ఉంది. మొత్తానికి కేసీఆర్ ని ముందు పెట్టి అధికారం సంపాదించాలన్నది గులాబీ పార్టీ చాణక్య వ్యూహంగా కనిపిస్తోంది అంటున్నారు.

# విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్

**ముద్ర, విజయవాడ:**
విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ప్రతిష్టాత్మకమైన 'పాన్ ఐఐటీ సమ్మిట్' అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ వేదికపై యువ ఐఐటీయన్లు, వివిధ స్టార్టప్ సంస్థలు ప్రదర్శించిన ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**స్టాళ్ల సందర్శన.. ప్రత్యేక ఆకర్షణగా ప్రాజెక్టులు**
సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఆవిష్కరణలను సీఎం తిలకించి, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్సి ఏరోస్పేస్ డ్రోన్: ఆక్సి ఏరోస్పేస్ సంస్థ రూపొందించిన లేటెస్ట్ డ్రోన్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు ఆ డ్రోన్‌పై సీఎం స్వయంగా సంతకం చేయడం విశేషం. పెట్రోల్ బైక్స్ టూ ఈవీ కన్వర్షన్: పెట్రోలుతో నడిచే టూ-వీలర్లను కేవలం గంటల వ్యవధిలో ఎలక్ట్రిక్ వెహికల్స్‌గా మార్చే సరికొత్త టెక్నాలజీని ప్రదర్శించిన స్టాల్‌ను సీఎం సందర్శించారు. ఈ విధానంపై ఆరా తీసిన ఆయన, ఈ ప్రాజెక్ట్‌ను ప్రత్యేకంగా ఏపీలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ రిపోర్ట్ యాప్: కేవలం ఫేస్ స్కాన్ చేసిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య రిపోర్టును అందించే సరికొత్త యాప్‌ను రూపొందించిన స్టార్టప్ స్టాల్‌ను కూడా సీఎం సందర్శించి, వారి ప్రతిభను ప్రశంసించారు. చిన్నారుల ఆవిష్కరణలు: 'స్వర్ణాంధ్ర-10 సూత్రాల' అమలులో టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించవచ్చనే అంశంపై చిన్నారులు తమ ఆలోచనలను సీఎంకు వివరించారు. వారి ప్రతిభను మెచ్చిన చంద్రబాబు చిన్నారులను అభినందించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

**భారత్ మోడల్ చూపిద్దాం: లోకేశ్**
ఈ సదస్సులో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ ప్రపంచానికి భారత్ మోడల్‌ను చూపిస్తామని, ఆ మోడల్ కచ్చితంగా అమరావతి నుంచే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ స్థానంలో ఉండాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఇందుకోసం విభాగాల వారీగా 23 క్లస్టర్లను ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. అభివృద్ధి చెందిన దేశాలుగా అవతరించడానికి అమెరికా, యూరప్‌లకు వందేళ్లు పట్టింది. కానీ, వచ్చే పదేళ్లలో భారత్ ఆ స్థాయికి చేరుకుంటుంది. ఆ ప్రయాణంలోఏపీ అందరి కన్నా ముందుంటుంది. అభివృద్ధి ప్రయాణంలో 'పాన్ ఐఐటీ' మాకు మార్గదర్శనం చేయా లని కోరుతున్నాను" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సదస్సు రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి, పారిశ్రామిక వృద్ధికి ఒక గొప్ప వేదికగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.



# శ్రీసిటీలో బాయిలర్ పేలి మంటలు

**ముద్ర, అమరావతి:**
తిరుపతి జిల్లాలోని ప్రముఖ పారిశ్రామిక ప్రాంతమైన శ్రీసిటీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి తర్వాత ఇక్కడ ఉన్న ఓ ప్రైవేట్ ఫార్మా పరిశ్రమలో ఉన్నట్టుండి భారీ పేలుడు సంభవించింది. దుర్ఘటనలో ఐదుగురు కార్మికులు మరణించారు.

**అసలేం జరిగింది?**
శ్రీసిటీలోని 'టిల్ హెల్త్ కేర్' పరిశ్రమలో శుక్రవారం రాత్రి కార్మికులు ఎప్పటిలాగే తమ నైట్ షిఫ్ట్ విధుల్లో ఉన్నారు. అయితే అర్థరాత్రి సమయంలో ఉన్నపళంగా ప్లాంట్‌లోని బాయిలర్/రియాక్టర్ విభాగంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు దాటికి ప్లాంట్ ఆవరణ తీవ్రంగా దెబ్బతింది. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న కార్మికులు ప్రమాదంలో చిక్కుకుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర రెస్క్యూ టీమ్‌లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలను వేగవంతం చేశారు. మంటలను అదుపులోకి తెచ్చి, శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారు.

**ఘటనపై విచారణకు ఆదేశం**
ఈ ప్రమాదంలో మరణించిన వారి వివరాలు, గాయపడిన వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. అసలు బాయిలర్‌లో సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా లేక నిర్వహణ లోపాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమల శాఖ అధికారులు, సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు సైతం ఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనతో శ్రీసిటీలోని ఇతర పారిశ్రామిక యూనిట్లలో తీవ్ర కలకలం రేగింది.

# సీజేపీ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

**బీజేపీపై సీజేపీ ఆరోపణలు**
స్థానికుల నిరసన వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ ఆరోపించింది. తమను వ్యతిరేకించేందుకు కొందరిని ఉద్దేశపూర్వకంగా అక్కడికి పంపించారని విమర్శించింది. మరోవైపు ముంబై బీజేపీ మాత్రం స్థానికులకు మద్దతుగా నిలిచింది. శివాజీ పార్క్‌లో స్థానికుల అభ్యంతరాలను గౌరవించాలని స్పష్టం చేసింది. దీంతో ఈ వ్యవహారం కేవలం పోలీస్ అనుమతుల వివాదంగా కాకుండా.. సీజేపీ వర్సెస్ స్థానిక యువత పోరుగా మారిందనే చర్చ మొదలైంది.

**ఢిల్లీలోనూ పోలీసుల యాక్షన్**
ఇదే సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కూడా సీజేపీ, ఇతర విద్యార్థి సంఘాల నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)ను నిరసిస్తూ ఆందోళన చేపట్టిన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (AISA) సభ్యులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు కొందరు నిరసనకారులు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. AISA అధ్యక్షురాలు నేహా బోరాతో పాటు సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, కపిల్ సిబల్ తదితరులు కూడా నిరసనలో పాల్గొన్నారు.

**400-500 మందిపై కేసులు**
ముంబైలో శివాజీ పార్క్ వద్ద అనుమతి లేకుండా నిరసన నిర్వహించిన వ్యవహారంపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నిరసన నిర్వాహకులతో పాటు సుమారు 400-500 మంది గుర్తుతెలియని సీజేపీ మద్దతుదారులపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 189, 223తో పాటు మహారాష్ట్ర పోలీస్ చట్టంలోని సెక్షన్లు 37(1)(3), 135 కింద కేసులు నమోదయ్యాయి.

**మైనర్ల వినియోగంపై NHRC సీరియస్**
సీజేపీ నిరసనల్లో మైనర్ పిల్లలను 'రక్షణ కవచాలుగా' ఉపయోగించారనే ఆరోపణలు రావడం మరో వివాదానికి దారితీసింది. ఈ అంశంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) సుమోటోగా స్పందించింది. ముంబై పోలీస్ కమిషనర్, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర మహిళా-శిశు అభివృద్ధి శాఖలకు నోటీసులు జారీ చేసింది. మైనర్లను ఉద్దేశపూర్వకంగా నిరసనల్లో ఉపయోగించారా? అనే అంశంపై విచారణ చేపట్టాలని ఆదేశించింది.

**ఢిల్లీ నుంచి ముంబై వరకు.. సీజేపీకి ఎదురుదెబ్బ?**
ఢిల్లీలో పోలీసుల అదుపు.. ముంబైలో స్థానికుల వ్యతిరేకత.. అనుమతి లేకుండా నిరసనపై కేసులు.. మైనర్ల వినియోగంపై NHRC నోటీసులు.. ఇలా వరుస పరిణామాలతో సీజేపీ ఆందోళనలు రాజకీయంగా, న్యాయపరంగా కొత్త మలుపు తీసుకున్నాయి. మరోవైపు శివాజీ పార్క్‌లో సీజేపీని అడ్డుకున్న స్థానిక యువత వ్యవహారం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయ పార్టీల నిరసనలకు కొత్త తరం యువత ఎలా స్పందిస్తోంది? అన్న ప్రశ్నకు ఈ ఘటన అద్దం పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శివాజీ పార్క్‌లో సీజేపీకి లోకల్స్ ఝలక్.. ఢిల్లీలో పోలీస్ యాక్షన్.. కేసులతో ముంబై హీట్.. NHRC ఎంట్రీతో వివాదం మరింత ముదిరింది. దీంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చంతా ఒక్కటే-ఇది సీజేపీ వర్సెస్ బీజేపీ పోరా? లేక సీజేపీ వర్సెస్ ముంబై జెన్ జెడ్ వారా?

# ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల ను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. అక్టోబర్ 10 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

**ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ..**
ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'సద్దుల బతుకమ్మ'ను ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ (Tank Bund)పై వేలాది మంది మహిళలతో కలిసి అట్టహాసంగా నిర్వహించనున్నారు. అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు భారీ బతుకమ్మ ర్యాలీ నిర్వహించనున్నారు. అదేవిధంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో 10 రోజుల పాటు ప్రత్యేక బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. అలాగే తెలంగాణలోని అన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**నిమజ్జన ఏర్పాట్లు.. స్పెషల్ లోగో**
ట్యాంక్‌బండ్‌పై జరిగే వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మ ఘాట్, నెక్లెస్ రోడ్‌లో పూల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈసారి బతుకమ్మ వేడుకల కోసం ప్రభుత్వం ఓ స్పెషల్ లోగో (Special Logo)ను రూపొందిస్తుండగా.. ఆ లోగోలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ (Telangana Global Summit) అంశాన్ని కూడా జోడించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది.

## బీజేపీ+బీఆర్ఎస్..
# కాంగ్రెస్ కే లాభమా?

(మొదటి పేజీ తరువాయి)

**కేటీఆర్‌దీ అదే మాట**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఇటీవల బీజేపీతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీతో పొత్తు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. తమ పార్టీకి సొంతంగా బలం ఉందని.. ప్రజల మద్దతుతో తిరిగి అధికారంలోకి వస్తామని పేర్కొన్నారు.

**ఎందుకీ ప్రచారం?**
ఇరు పార్టీల నేతలు పదేపదే ఖండిస్తున్నప్పటికీ బీజేపీ—బీఆర్ఎస్ పొత్తుపై ప్రచారం మాత్రం ఆగడం లేదు. ప్రధానంగా 2028 ఎన్నికల్లో త్రిముఖ పోరు జరిగితే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలి కాంగ్రెస్‌కు లాభం చేకూరే అవకాశం ఉందన్న అంచనాలే ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. అదే సమయంలో తెలంగాణ రాజకీయాల్లో ఎన్నికల సమీకరణాలు చివరి వరకు మారే అవకాశం ఉండటంతో.. ఇప్పుడే ఏ పొత్తునూ పూర్తిగా కొట్టిపారేయలేమన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అప్పటి రాజకీయ పరిస్థితులు, పార్టీల బలాబలాలు, ఎన్నికల వ్యూహాలను బట్టి సమీకరణాలు మారే అవకాశం ఉంది. పొత్తు జరుగుతుందా? లేదా? అన్నది పక్కన పెడితే.. బీజేపీ—బీఆర్ఎస్ పొత్తు అంశం మాత్రం తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటికీ రచ్చ రేపుతూనే ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 04.10.2026
www.mudranews.in | @mudranews



**మజ్జిగ : ఎముకలకు బలం**

మజ్జిగలో కాల్షియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలు, దంతాల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సవాల్

**- సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్..**
**- నర్సాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీ నేతల భారీ చేరికలు**
**- సింగరేణి విద్యుత్ ఒప్పందంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత**
**-కాళేశ్వరం నీళ్లు, రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**



**ముద్ర, హైదరాబాద్ :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కొత్తగా చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పాత రోజులు మళ్లీ తెస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిజంగానే కరెంట్ కోతలు, మందులు లేని ఆసుపత్రులతో ఆ చీకటి రోజులను మళ్లీ తీసుకొచ్చారని విమర్శించారు.

**సింగరేణి ప్లాంట్ రాజస్థాన్‌కు విక్రయం.. విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 800 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ పొందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రాజస్థాన్ రాష్ట్రానికి అమ్మేందుకు ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. మొదట్లో 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు బొగ్గు లేదనే నెపంతో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లలో ఏకంగా 2,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిందని మండిపడ్డారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు, సరిపడా మందులు లేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కాళేశ్వరం నీళ్లు, రుణమాఫీపై ఘరానా మోసం**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి వద్ద మోటార్లు ఆన్ చేస్తే నర్సాపూర్ ప్రాంతానికి పారక నీరు వస్తుందని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసినప్పటికీ నీటిని పంపింగ్ చేయడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు. కాళేశ్వరం నీళ్లు చూస్తే ప్రజలకు కేసీఆర్ గుర్తుకొస్తారనే ఉద్దేశంతోనే ప్రభుత్వం నీటిని పంపింగ్ చేయడం లేదని విమర్శించారు. దేవుళ్లపై ప్రమాణం చేసి రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, మూడేళ్లు గడుస్తున్నా రుణమాఫీ పూర్తి చేయకుండా రైతులను ఘరానా మోసం చేశారని ధ్వజమెత్తారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలి: రేవంత్‌కు సవాల్**

రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటోందని హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కేసీఆర్ రూ. 19,500 కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. ఈ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రూ. 500 కోట్లు కూడా ఇవ్వలేదని ఆరోపించిన ఆయన, విద్యార్థులకు ఎంత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారో ధైర్యముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఆయన మాటలను ప్రజలు ఇక ఏమాత్రం నమ్మరని స్పష్టం చేశారు.

## విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయాలి

- శ్రీధర్‌బాబు



**ముద్ర, హైదరాబాద్:** విద్యార్థులకు డిగ్రీతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం అందించి ఉద్యోగ ప్రపంచానికి సిద్ధం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం కూకట్ పల్లిలోని జేఎన్ టీయూహెచ్ లో నిర్వహించిన REACH–2026 సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విశ్వవిద్యాలయంలో స్టార్టప్ లు, ఆవిష్కరణలకు ప్రత్యేక ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలు–విద్యాసంస్థలు కలిసి ఇంటర్న్ షిప్ లు, అప్రెంటిస్ షిప్ లు, లైవ్ ప్రాజెక్టులు, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతలో నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

## రేవంత్ సర్కార్‌లో సమన్వయ లోపం

- కూనంనేని




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రతిపక్షాలు అందిపుచ్చుకోలేకపోతున్నాయని వ్యాఖ్యానించారు. అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితమవుతోందని, మంత్రులకు ఆర్థిక స్వేచ్ఛ లేక పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రధర్మాన్ని కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డిల జోక్యం ఆపాలని డిమాండ్ చేశారు. ఓటర్ల తొలగింపు ప్రజాస్వామ్యానికి విఘాతమని, దీనిపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి టియూడబ్ల్యూజె ఐజెయు రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయకర్త గా వ్యవహరించారు.

## నిరుద్యోగులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

**ముద్ర, హైదరాబాద్ :** నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన కోచింగ్‌కు దూరమవుతున్న అభ్యర్థులకు పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి సుమారు రూ.40 వేల విలువైన ఆన్‌లైన్ కోచింగ్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ సదుపాయం ఈ నెల 28 నుంచి అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్, గ్రూప్–1, 2, 3, 4, పంచాయతీ సెక్రటరీ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, రైల్వే తదితర పోటీ పరీక్షలకు జనరల్ స్టడీస్, మాక్ టెస్టులు, 5 వేలకు పైగా వీడియో క్లాసులు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఏడాది పాటు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని చెప్పారు.

## ఎల్‌నినో నేపథ్యంలో తక్కువ నీటి పంటల వైపు రైతులు




**ముద్ర, హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశాల నేపథ్యంలో యాసంగిలో స్వల్పకాలిక, తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో సాగయ్యే పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను రైతులు ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శనివారం 'రైతు నేస్తం' 109వ ఎపిసోడ్‌లో రబీ 2026–27 సీజన్‌కు విత్తన పంపిణీని మంత్రి ప్రారంభించారు. ప్రాజెక్టుల నీటి నిల్వలకు అనుగుణంగా పంటల సాగు, నీటిపారుదల ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. NFSM, NMEO-OS పథకాల కింద వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వులు, శనగ, మినుము, పెసర విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విత్తన రకం, పథకం నిబంధనలను బట్టి 50–75 శాతం వరకు, కొన్ని రకాలకు 100 శాతం వరకు సబ్సిడీ అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రాలు లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సిడ్నీలో తెలంగాణ మహిళకు అరుదైన గౌరవం

**ముద్ర, హైదరాబాద్:** ఆస్ట్రేలియాలోని సిడ్నీ పరిధిలోని స్ట్రాత్‌ఫీల్డ్ 73వ మేయర్‌గా హైదరాబాద్ ఖైరతాబాద్‌కు చెందిన కర్రి సంధ్యారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వికారాబాద్ జిల్లా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆమె మేనకోడలు. 1991లో ఆస్ట్రేలియాకు వెళ్లిన సంధ్యారెడ్డి ఇమిగ్రేషన్ న్యాయవాదిగా స్థిరపడ్డారు. ఇప్పటి వరకు డిప్యూటీ మేయర్‌గా సేవలందించిన ఆమె, తాజాగా మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2028 సెప్టెంబర్ వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.తెలంగాణ నుంచి ఆస్ట్రేలియాలో మేయర్ పీఠాన్ని అధిరోహించిన తొలి మహిళగా సంధ్యారెడ్డి గుర్తింపు పొందారు.

## పిల్లల ఆన్‌లైన్ భద్రతకు సమగ్ర ఫ్రేమ్‌వర్క్

**సీఎం రేవంత్**




**ముద్ర, హైదరాబాద్ :** పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం సమగ్ర చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన NALSA దక్షిణ మండల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పిల్లల సైబర్ భద్రతకు పోలీసు, న్యాయ, చైల్డ్ ప్రొటెక్షన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణలో భరోసా కేంద్రాలు, చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, SHE–భరోసా సైబర్ ల్యాబ్‌లు, CybHER యాప్ ద్వారా పిల్లల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. పిల్లల ఆన్‌లైన్ భద్రతపై తల్లిదండ్రులు అవగాహనతో వారితో మాట్లాడాలని సూచించారు. సైబర్ నేరాల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లను గుర్తుంచుకోవాలని సీఎం కోరారు.

## అనంతగిరి ఘాట్‌లో బస్సు బోల్తా.. నలుగురు మృతి

**ముద్ర, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో శనివారం ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో నలుగురు మృతి చెందగా.. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు.. ప్రమాదకర మలుపు వద్ద బ్రేకులు విఫలం కావడంతో బోల్తా పడినట్లు పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. మృతుడు కొత్తగడి నారాయణరెడ్డి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు క్యాసారం ప్రాంతానికి చెందిన వారు చింతకుంటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను వికారాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ఆ 4 రాష్ట్రాల్లో బ్యాలెట్ తో ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమా?



**ముద్ర, హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈవీఎంలపై కాంగ్రెస్ పదేపదే ఆరోపణలు చేయడాన్ని ప్రశ్నిస్తూ.. కేరళ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈవీఎంల ద్వారానే గెలిచాయని అన్నారు. ఈ నాలుగు రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేసి ప్రభుత్వాలను రద్దు చేసి, బ్యాలెట్ పేపర్లతో మళ్లీ ఎన్నికలకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో దొంగ ఓట్ల తొలగింపుతోనే కేరళలో గెలిచామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు.

దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషీమాత ఆలయంపై దాడిని బండి సంజయ్ ఖండించారు. ఆలయాలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితులను పిచ్చివారిగా చిత్రీకరించి సమస్యను పక్కదారి పట్టించొద్దని అన్నారు. కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్యసాహసా లను ప్రపంచం అభినందిస్తుంటే కాంగ్రెస్ నేతలు స్పందించకపో వడం సిగ్గుచేటని విమర్శించారు. ఓట్ల భయంతోనే కాంగ్రెస్ నేతలు మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ పరస్పరం రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నాయని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన అనివార్య కారణాలతో వాయిదా పడిందని బండి సంజయ్ తెలిపారు.

## కామన్ పాస్ తో మెట్రో రైల్, ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రులు

**భవిష్యత్ లో మరిన్ని ప్రజారవాణా సదుపాయాలతో అనుసంధానిస్తామని వెల్లడి**



**ముద్ర, హైదరాబాద్ :** నిన్న లాంఛనంగా ప్రారంభమైన మెట్రో–ఆర్టీసీ కామన్ పాస్ సౌలభ్యాన్ని ప్రజలకు మరింత చేరువకు తేవడానికి నేడు ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు హైదరాబాద్ లోని మెట్రో రైల్ లో ప్రయాణం చేసారు. పాస్ ని కొనుగోలు చేసి బేగంపేట్ నుండి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ మెట్రో స్టేషన్ వరకు మెట్రో రైల్ లో ప్రయాణం చేసారు. అక్కడి నుండి అదే పాస్ ని ఉపయోగించి మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసారు. మెట్రో స్టేషన్లలో ఉన్న ప్రయాణీకులతో ఉప ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడి వారి నగరంలో ప్రజా రవాణా, మెట్రో ప్రయాణం పై స్పందనను తెలుసుకున్నారు. మెట్రో–ఆర్టీసీ రోజువారీ, నెలవారీ ఉమ్మడి పాస్ ని ప్రవేశపెట్టడంపై ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని ఉపముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క అన్నారు. ఈ సౌలభ్యాన్ని భవిష్యత్ లో ఆటోలు, ఇతర ప్రజా రవాణా వ్యవస్థల తో అనుసంధానిస్తామని ఆయన వెల్లడించారు. ప్రజలు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకోవాలన్నదే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఒకే పాస్ వినియోగించి నగరంలో సునాయసంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని రవాణా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇంకా ఈ సేవలను రానున్న రోజుల్లో విస్తరించనున్నట్టు ఆయన చెప్పారు. పాస్ ధరలను ప్రజల అభిప్రాయం మేరకు పునఃసమీక్షిస్తామని రవాణా మంత్రి వెల్లడించారు. కార్మిక ఉపాధి శాఖ మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మహమ్మద్ అజారుద్దీన్, కూడా ఈ సందర్భంగా మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసనసభ్యులు శ్రీ నవీన్ యాదవ్, శ్రీ గణేష్ తో పాటు టీఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు(అర్బన్ ట్రాన్స్పోర్ట్, మెట్రో) శ్రీ ఎన్వీఎస్ రెడ్డి, హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బి.అజిత్ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ ఎండీ శ్రీ వై. నాగిరెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ సిఓఓ సుధీర్ చిప్లున్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సంచార లోక్ అదాలత్ వాహనాలకు సీఎం రేవంత్ శ్రీకారం

**మారుమూల ప్రాంతాలకూ న్యాయసేవలు**

**ముద్ర, హైదరాబాద్ :** ప్రజలకు న్యాయసేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ (TGLSA) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార లోక్ అదాలత్ (Mobile Lok Adalat) వాహనాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఉచిత న్యాయసేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి. మోహన, జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ విక్రమ్ నాథ్ హాజరయ్యారు.

గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు న్యాయసేవలు అందుబాటులోకి తీసుకెళ్లడమే సంచార లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం. ఈ వాహనాల ద్వారా ప్రజలకు న్యాయపరమైన అంశాలపై అవగాహన, ఉచిత న్యాయసహాయం, సమస్యల పరిష్కారానికి మార్గనిర్దేశం అందించనున్నారు.రాజీ ద్వారా పరిష్కరించగల వివాదాలను లోక్ అదాలత్ విధానంలో పరిష్కరించేందుకు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా పేదలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు ఈ సేవలు ఉపయోగపడనున్నాయి.



కోర్టులను ఆశ్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రజలకు న్యాయసేవలను వారి ప్రాంతాలకే తీసుకెళ్లడం ద్వారా 'న్యాయం అందరికీ' అనే లక్ష్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం దోహదపడనుంది.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com



# అమెరికా టెక్ ప్రపంచంలో సరికొత్త తుఫాను

రేపటి గురించి ఆశలతో ఆఫీస్ గుమ్మంలో అడుగుపెట్టిన వేలాది మంది టెక్ నిపుణులకు.. ఈరోజు ఇమెయిల్‌లో వచ్చే ఒక్క మెసేజ్ జీవితాన్ని తలకిందులు చేస్తోంది. కళ్ళల్లో వేయి కాంతులతో.. రేపటి భవిష్యత్తు కోసం అహర్నిశలూ శ్రమించిన చేతులే.. ఇప్పుడు ల్యాప్‌టాప్ స్క్రీన్‌పై "యువర్ రోల్ హాస్ బీన్ ఎలిమినేటెడ్" అనే నిష్ఠుర సత్యాన్ని చూసి అచేతనమైపోతున్నాయి. అప్పటిదాకా కంపెనీని తమ సొంత ఇల్లులా భావించి కష్టపడిన ఉద్యోగులు.. మరుసటి క్షణమే కంపెనీ బ్యాలెన్స్ షీట్‌లో కేవలం ఒక "ఖర్చు"గా మారి వీధిలోకి తోసేయబడుతుంటే.. టెక్ ప్రపంచం ఐడీ కార్డ్ వెనుక దాగున్న కన్నీళ్లను.. ఆందోళనలను పట్టించుకోకుండా నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతోంది.

ఒకప్పుడు ఆ ఉద్యోగమే ఒక కల.. ఐటీ ప్రపంచంలో అడుగుపెడితే జీవితం స్థిరపడినట్లే అని నమ్మిన వేలాది మంది టెక్ నిపుణుల జీవితాల్లో ఇప్పుడు ఆందోళన నిండిపోయింది. అమెరికా టెక్ ప్రపంచంలో సరికొత్త తుఫాను చెలరేగుతోంది. నిన్నటిదాకా ఆధునిక సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దిగ్గజ కంపెనీలు.. ఇప్పుడు "ఖర్చులు తగ్గించుకోవాలి" అనే ఒకే ఒక్క మాటతో ఉద్యోగుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

**మానవ శక్తికి ప్రత్యామ్నాయంగా ఏఐ.. గుండెల్లో గుబులు!**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధి చెందుతున్న కొద్దీ సంతోషించాల్సింది పోయి.. టెక్ ఉద్యోగులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంపెనీలు తమ ప్రాధాన్యతలను మార్చుకుంటూ ఏఐ ప్రాజెక్టుల్లోకి భారీగా పెట్టుబడులను మళ్లిస్తున్నాయి. దీనివల్ల సాంప్రదాయ ఉద్యోగాలకు గండం ఏర్పడుతోంది. మేనేజ్‌మెంట్ స్థాయిలను కుదించడం పేరుతో వేలాది మందిని అర్ధాంతరంగా ఇళ్లకు పంపించేస్తున్నారు.

**యాపిల్ లోనూ అదే టెన్షన్.. జాన్ టెర్నస్ నిర్ణయాలపై ఉత్కంఠ**

ఎలాంటి ఆపద రాదు అని భావించే 'యాపిల్' సంస్థలోనూ ప్రస్తుతం ఆందోళనకర వాతావరణం నెలకొంది. సంస్థను మరింత సన్నద్ధంగా మార్చే క్రమంలో మిడిల్ మేనేజ్‌మెంట్‌కు కోతలు పెట్టి ఇంజినీర్లను నేరుగా టాప్ ఎగ్జిక్యూటివ్‌లతో పనిచేయించే దిశగా కొత్త మార్పులు జరుగుతున్నాయి. ఉత్పత్తుల లాంచ్ సైకిల్‌ను మార్చడం.. కొన్ని విభాగాల్లో నిశ్శబ్దంగా కోతలు విధిస్తుండటం ఉద్యోగులకు నిద్రలేకుండా చేస్తోంది. సిరి, విజన్ ప్రో, ఏఐ సాఫ్ట్‌వేర్ విభాగాలపైనా ఈ ప్రభావం కనిపిస్తుండటంతో తదుపరి ఎవరి వంతు వస్తుందోనని ప్రతి ఒక్కరూ భయపడుతున్నారు.

**దిగ్గజాల బాటలోనే వర్క్‌డే, ఒరాకిల్, అమెజాన్**

కేవలం యాపిల్ మాత్రమే కాదు.. వర్క్‌డే తన సిబ్బందిలో 2.5 శాతం సుమారు 500 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉబర్ ఏకంగా 3,300 మందిని ఇంటికి పంపే ప్రణాళికతో ముందడుగు వేస్తోంది. అమెజాన్, మెటా, ఒరాకిల్ వంటి సంస్థలు కూడా ఇదే బాటలో పయనిస్తూ ఉపాధిని దెబ్బతీస్తున్నాయి. క్రంచ్ బేస్ గణాంకాల ప్రకారం.. 2026 ప్రారంభం నుంచి ఆగస్టు నాటికి కనీసం 94,046 మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఇది గతేడాదితో పోలిస్తే 16.8 శాతం ఎక్కువ కావడం గమనార్హం.

మొత్తంగా అమెరికా లేబర్ మార్కెట్ స్థిరంగా ఉన్నప్పటికీ టెక్ రంగాన్ని నమ్ముకున్న మానవ వనరుల పరిస్థితి మాత్రం రోజురోజుకూ అభద్రతాభావంలోకి నెట్టబడుతోంది. కష్టపడి నిర్మించుకున్న కెరీర్లు ఒక్క నిమిషంలో ముగిసిపోతున్నాయనే వేదన టెక్ ఉద్యోగులను ఊపిరాడనివ్వడం లేదు.

# మానవ మనుగడకు మూలాధారం వన్యప్రాణి సంరక్షణ

మానవ మనుగడకూ, భూగోళ పర్యావరణ సమతుల్యతకూ మూలాధారమైన జంతుజాలాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేసే ముఖ్యమైన సందర్భం అంతర్జాతీయ జంతు దినోత్సవం (వరల్డ్ యానిమల్ డే). ప్రతి సంవత్సరం అక్టోబర్ 4వ తేదీన జీవవైవిధ్యం, జంతు సంక్షేమం మరియు పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంపొందించడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రకృతిలో మానవులతో పాటు సమాన హక్కులు కలిగి ఉన్న జంతువుల ప్రాముఖ్యతను గుర్తించడం, వాటి ప్రత్యేకాధికారాలను రక్షించడం, మానవ చర్యల వల్ల వాటికి ఎదురవుతున్న ముప్పును విశ్లేషించడం ఈ రోజు ప్రధాన ఉద్దేశం.

ఈ దినోత్సవం వెనుక సుదీర్ఘమైన చరిత్ర ఉంది. పర్యావరణ వేత్త, రచయిత హెన్రిచ్ జిమ్మెర్ మాన్ 1925 మార్చి 24న జర్మనీలోని బెర్లిన్‌లో మొదటిసారిగా జంతు దినోత్సవాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రకృతి, జంతువుల పట్ల అగాధమైన ప్రేమను కనబరిచిన కాథలిక్ ప్రవక్త 'సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి' గుర్తుగా, ఆయన స్మారక దినమైన అక్టోబర్ 4వ తేదీకి ఈ జంతు దినోత్సవాన్ని 1931లో ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో జరిగిన అంతర్జాతీయ జంతు పరిరక్షణ కాంగ్రెస్‌లో అధికారికంగా మార్చారు. నాటి నుంచి నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా జీవుల సంక్షేమం కోసం పనిచేసే సంస్థలు, పర్యావరణ ప్రేమికులు ఈ రోజును ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నారు.

ప్రకృతి చక్రంలో ప్రతి జంతువుకు ఒక విశిష్ట పాత్ర ఉంది. అడవుల విస్తరణకు తోడ్పడే శాకాహార జంతువుల నుంచి పర్యావరణ సమతుల్యతను కాపాడే క్రూర మృగాల వరకు ప్రతి జీవీ ఆహార గొలుసు లో కీలకమైన లంకెగా పనిచేస్తాయి. జంతుజాలం నశిస్తే పర్యావరణ వ్యవస్థ చిన్నాభిన్నమై, చివరికి ఆ ప్రభావం మానవాళి మనుగడపైనే పడుతుంది. కిరీట పులులు, ఏనుగులు, తిమింగలాలు మొదలుకొని చిన్నపాటి క్రిమి కీటకాల వరకు ప్రతి జీవీ భూగోళ ఆరోగ్యానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోహదపడతాయి. అయితే, ప్రస్తుత ఆధునిక కాలంలో జంతుజాలం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.



మానవుల స్వార్థం, అడవుల నరికివేత, వేగవంతమైన పట్టణీకరణ, కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల వేలాది జంతు జాతులు అంతరించిపోయే దశకు చేరుకున్నాయి. చర్మం, దంతాలు, కొమ్ముల కోసం జరుగుతున్న అక్రమ రవాణా, వేట జంతువుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అంతేకాకుండా, పెంపుడు జంతువులపై జరుగుతున్న హింస, ప్రయోగశాలల్లో పరిమితి దాటి చేసే ప్రయోగాలు మానవత్వానికే మచ్చగా మారుతున్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జన్యు సాంకేతికత పెరిగిన ప్రస్తుత డిజిటల్ యుగంలో జంతు సంరక్షణకు ఆధునిక సాంకేతికత ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. ఉపగ్రహ ట్ర్యాకింగ్, డ్రోన్లు, ఏఐ కెమెరా ట్రాప్‌లు, బయో–సెన్సార్ల ద్వారా అడవుల్లో జంతువుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అక్రమ వేటను అడ్డుకోవడం నేడు సాధ్యమవుతోంది. సాంకేతికతను కేవలం మానవ సౌకర్యాల కోసమే కాకుండా, అంతరించిపోతున్న అరుదైన జీవుల సంతతిని కాపాడేందుకు, వాటి సహజ ఆవాసాలను సరిహద్దులు లేకుండా పరిరక్షించేందుకు వినియోగించడం సాంకేతిక ప్రగతికి నిజమైన సార్థకతను ఇస్తుంది.

మరొక వైపు, శీతోష్ణస్థితి మార్పులు వల్ల సముద్ర అంతర్భాగంలోని ప్రాణికోటి తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటోంది. ఉష్ణోగ్రతలు పెరగడం, ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాలలో కలవడం వల్ల పగడపు దిబ్బలు నశించిపోతూ, కోట్లాది జలచరాల మనుగడ ప్రమాదంలో పడింది. భూమిపై ఉన్న జంతువులతో పాటు సముద్ర జీవుల సంక్షేమం కూడా గ్లోబల్ వార్మింగ్ నియంత్రణపైనే ఆధారపడి ఉందనే సత్యాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించి, స్థిరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా మాత్రమే మనం భూగోళంపై ఉన్న ప్రతీ జీవికి సురక్షితమైన భవిష్యత్తును అందించగలము.

ఈ సమస్యల నివారణకు కేవలం చట్టాలు మాత్రమే సరిపోవు, ప్రజలలో మూలమట్టం నుంచి వైఖరి మారాల్సి ఉంది. జంతు సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయడం, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలను అభివృద్ధి చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం మరియు పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు జంతువుల పట్ల దయ, కరుణ పెంపొందించే విద్యను అందించడం అత్యంత ఆవశ్యకం.

అంతర్జాతీయ జంతు దినోత్సవం అనేది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాదు; భూమిపై ఉన్న ప్రతి ప్రాణినీ గౌరవించాలని గుర్తుచేసే ఒక పిలుపు. "జీవించు–జీవించ నివ్వు" అనే సూత్రాన్ని పాటిస్తూ, మూగజీవుల పట్ల సహానుభూతి కలిగి ఉండటం మానవాళి ప్రాథమిక బాధ్యత. జీవవైవిధ్యాన్ని కాపాడుకున్నప్పుడే రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, సమతుల్యమైన భూగోళాన్ని అందించగలము.

సుధాకర్ .ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్
(STUTS), 9000674747



# వేలాడుతున్న మనిషి

పెద్దలు చెప్పిన కొన్ని పిట్టకథలు లోతైన తాత్వికసత్యాలను సులువుగా అర్థమయ్యేట్టు చేస్తాయి. అలాంటిదే బావిలో వేలాడుతున్న మనిషి కథ.

ఒక మనిషిని క్రూరమృగం తరుముతోంది. ప్రాణభయంతో పరుగెత్తిన అతడు కాలుజారి పాడుబడిన బావిలోకి పడబోతూ గట్టున ఉన్న చెట్టుకొమ్మను అందిపుచ్చుకున్నాడు. బావిలో పడిపోకుండా దాన్ని పట్టుకుని వేలాడుతూ ఉండిపోయాడు. కింద ఒక పెద్ద విష సర్పం అతడివైపే చూస్తోంది. తరుముకొచ్చిన క్రూరమృగం బావి అంచున కూర్చుంది. పైకి వెళ్లలేడు. కిందకు దిగలేడు. పట్టుకున్న కొమ్మే అతడికి ప్రాణాధారం. ఆ కొమ్మను పరిశీలనగా చూశాడు. రెండు పెద్ద ఎలుకలు దాన్ని కొరుకుతున్నాయి. అది ఏ క్షణాన్నయినా విరిగిపోవచ్చు. ఇవన్నీ చాలవన్నట్లు కాస్త పైన మరో కొమ్మకు తేనెపట్టు ఉంది. అలికిడికి కదిలి తేనెటీగలు చుట్టూ తిరుగుతున్నాయి. అప్పుడే తేనెపట్టు నుంచి జారిన తేనె చుక్క ఒకటి అతడి పెదవిపై పడింది. దాన్ని రుచి చూసి 'ఎంత తియ్యగా ఉంది!' అనుకున్నాడు. మృత్యువు పొంచి ఉన్న విషయాన్ని మరచి, మరో తేనెచుక్క కోసం ఎదురు చూడసాగాడు.

ఈ కథ మనిషి జీవితానికి దర్పణం లాంటిది. ఇందులోని వ్యక్తి సాధారణ మనిషికి ప్రతీక. బావి లౌకికప్రపంచం. పట్టుకున్న చెట్టుకొమ్మ మనిషి జీవితం, కొమ్మను కొరుకుతున్న ఎలుకలు రేయింబగళ్లు. అనేక చిన్నాపెద్ద సమస్యలు ఆ తేనెటీగలు. జీవితంలో అనివార్యమైన ప్రమాదాలు, బాధలే విషసర్పం. తరుముకొచ్చిన క్రూరమృగం–మృత్యువు. మరి ఆ తేనెచుక్కలు? అవి ఇంద్రియాలకు కలిగే తాత్కాలిక సుఖాలు. చుట్టూ అనారోగ్యం, సమస్యలు, వృద్ధాప్యం, చివరికి మరణం పొంచి ఉన్నాయని తెలిసినా, క్షణికమైన ఇంద్రియసుఖాలలో మునిగి మనిషి తన అసలు పరిస్థితిని మరచిపోతాడు. అలా ఆ సుఖాలకు లొంగిపోకుండా జీవించాలన్నదే ఈ కథ చెప్పే సందేశం. తేనెచుక్కలు జీవితంలో ఉంటూనే ఉంటాయి. కానీ అవే జీవితమని భావించకూడదు.

ఇక్కడే భగవద్గీత మనకు మార్గనిర్దేశం చేస్తుంది. 'యదా సంహరతే చాయం కూర్మో...' తాబేలు తన అవయవాలను అవసరమైనప్పుడు లోపలికి ముడుచుకున్నట్లే, మనిషి తన ఇంద్రియాలను ప్రాపంచిక వ్యామోహాల నుంచి ఉపసంహరించగలిగినప్పుడు అతడి బుద్ధి స్థిరంగా ఉంటుందన్నది గీతాచార్యుడి బోధ. ఇంద్రియాలు మనకు సేవకులుగా ఉండాలే తప్ప, మనమే వాటికి బానిసలుగా మారకూడదు. తేనెచుక్కను ఆస్వాదించడంలో తప్పు లేదు, కానీ దానికోసం తను వేలాడుతున్న కొమ్మను, గడిచిపోతున్న కాలాన్ని, ఎదురు చూస్తున్న మృత్యువును మరచిపోవడమే అసలు ప్రమాదం!

జీవితంలో సుఖాలు ఉండాలి. అయితే వాటి మాధుర్యంలో మునిగిపోయి ఉత్కృష్టమైన మానవజన్మకు అంతిమ లక్ష్యమైన మోక్షసాధనను మరచిపోకూడదు. సుఖదుఃఖాలకు అతీతంగా మనసును పరమాత్మ వైపు మరల్చాలి. అహంకారాన్ని, మమకారాన్ని విడిచి, 'నీవే గతి' అనే సంపూర్ణ విశ్వాసంతో పరమాత్మను ఆశ్రయించి శరణాగతి చేయాలి. హృదయాన్ని పరమాత్మకు అర్పించి, ఫలాపేక్షను విడిచి ఆయన సంకల్పానికి తలవంచి జీవించడమే కర్మయోగం, మోక్ష మార్గం.

-అప్పరాజు నాగజ్యోతి

# సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో లాభమా.. నష్టమా..?



సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లుగా కొంతమందిని తీసుకుని వారి ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయించాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. ఈ క్రమంలోనే జీవో కూడా జారీ చేశారు. ఇన్ఫ్లుయెన్సర్లకు ఏ మేరకు పారితోషికులు ఇవ్వాలి ఎలా నియమించుకోవాలి అసలు ఎవరెవరిని తీసుకోవాలి అనే సమగ్ర వివరాలతో ఈ జీవో వచ్చింది. అయితే ఇప్పుడు అసలు సమస్య ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతోంది. ఇన్ఫ్లుయెన్సర్లను నియమించుకోవడం పట్ల ఎవరికీ అభ్యంతరం లేకపోయినప్పటికీ వారు చేసే ప్రచారం కొంత పాజిటివ్ వ్యవహారమే అయనా.. మరింతగా నెగిటివ్ ప్రచారం చేసే అవకాశం ఉందన్నది టిడిపి వర్గాలు అంచనా వేస్తున్నాయి. సహజంగా ఇన్ఫ్లుయెన్సర్లు అంటే రెచ్చిపోయి మాట్లాడుతారు.

ప్రభుత్వానికి ఇది మంచి పేరు తీసుకొస్తుంది. కానీ ఇదే సమయంలో అర్హత ఉండి కూడా పథకాలకు దూరమైన వర్గాలకు ఈ ప్రచారం తీవ్రంగా ఇబ్బంది కలిగించే అవకాశం ఉందని టిడిపి సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా 100 మంది అర్హత కలిగిన వారు ఉంటే వారిలో ఇప్పుడు సగం మందికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. కారణాలు అనేకం ఉండొచ్చు. కానీ, ఇప్పుడు వారంతా ఒక రకంగా మరిచిపోయారు. వస్తే వస్తాయి లేకపోతే లేదు అన్నధోరణిలో చాలా మంది సంక్షేమ పథకాలపై ఆలోచన చేస్తున్నారు.కానీ, ఇప్పుడు ఇన్ఫ్లుయెన్సర్ల ప్రభావం పథకాలు అందని వారిపై పడే అవకాశం ఉందని టిడిపి నాయకులు సహా కొందరు సలహాదారులు చెబుతున్నారు.

సహజంగానే పదిమందికి పథకాలు వచ్చి 11వ వ్యక్తికి అర్హత ఉండి కూడా రాకపోతే ఆ వ్యక్తి తీవ్రంగా ఆవేదన చెందుతాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూడా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ఇన్ఫ్లుయెన్సర్ల కారణంగా ఈ వ్యతిరేకత పెరిగే అవకాశం ఉండొచ్చు అనేది సలహాదారులు చెబుతున్న మాట. ముఖ్యంగా ఆర్థిక సలహాదారుగా ఉన్న కుటుంబరావు ఈ విషయంపై సీఎం చంద్రబాబుకు ఒక లేఖ రాశారని టిడిపి వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇన్ఫ్లుయెన్సర్లను అన్ని విషయాల్లోనూ ఉపయోగించుకోవడం వల్ల కొన్ని వర్గాలు మనకు దూరమయ్యే అవకాశం ఉంటుందని ఆయన చూచాయగా తన లేఖలో ప్రస్తావించినట్టు టిడిపి వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇన్ఫ్లుయెన్సర్ల ప్రభావం కొంతవరకు ప్రభుత్వానికి మేలు చేసినప్పటికీ అదే సమయంలో కొంత వ్యతిరేక ప్రభావం చూపించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

దీనిని బట్టి ఇన్ఫ్లుయెన్సర్ల విషయంలో ప్రభుత్వం మరింత జాగ్రత్తగా అడుగులు వేయాలని ఆయన సూచించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇన్ఫ్లుయెన్సర్లు అవసరం లేదని, ఇన్ఫ్లుయెన్సర్లుతో పనిలేదని గాని ఎవరూ చెప్పటం లేదు. కానీ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విషయంలో భారీ ప్రచారం చేసుకుంటే అవి అందని వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారే అవకాశం ఉందని మాత్రమే హెచ్చరిస్తున్నారు ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని టిడిపి నాయకులు సూచిస్తున్నారు.

# పచ్చి అరటికాయతో లాభాలు

మనం తరచుగా పండిన అరటిపండ్లను తింటూ ఉంటాం. కానీ, పచ్చి అరటికాయలో కూడా అమూల్యమైన పోషకాలు ఉంటాయని మీకు తెలుసా? భారతీయ వంటకాలలో పచ్చి అరటికాయతో వేపుళ్లు, కూరలు మరియు బజ్జీలు చేస్తుంటారు. పోషకాహార నిపుణుల ప్రకారం పచ్చి అరటికాయను మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటమే కాకుండా అనేక రోగాల నుండి రక్షణ లభిస్తుంది. పచ్చి అరటికాయ అందించే 5 ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాలు ఇవే:



**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది..**

పచ్చి అరటికాయలో రెసిస్టెంట్ స్టార్చ్, పీచు పదార్థం ఎక్కువగా ఉంటాయి. ఇవి కడుపులో ఆహారం సులభంగా జీర్ణమవడానికి సహాయపడతాయి. ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరించి మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది..**

పచ్చి అరటికాయ గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. దీని వల్ల ఇది తిన్న వెంటనే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఆకస్మికంగా పెరగవు. కాబట్టి, టైప్–2 మధుమేహం ఉన్నవారు ధైర్యంగా తమ ఆహారంలో పచ్చి అరటికాయను చేర్చుకోవచ్చు.

**బరువు తగ్గడానికి తోడ్పడుతుంది..**

బరువు తగ్గాలనుకునే వారికి పచ్చి అరటికాయ అద్భుతమైన ఆహారం. ఇందులో ఉండే డైటరీ ఫైబర్ మరియు రెసిస్టెంట్ స్టార్చ్ జీర్ణం కావడానికి కొంత సమయం తీసుకుంటాయి. దీనివల్ల కడుపు ఎక్కువ సేపు నిండినట్లు అనిపించి, అనవసరంగా ఆహారం తినే అలవాటు తగ్గుతుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 04.10.2026
www.mudranews.in | @mudranews



### బరువు నియంత్రణకు ఉపయోగకరం

చక్కెర, ఉప్పు ఎక్కువగా కలపకుండా తీసుకునే మజ్జిగ తక్కువ కేలరీల పానీయంగా ఉంటుంది. ఇతర అధిక కేలరీల పానీయాలకు బదులుగా తీసుకుంటే బరువు నియంత్రణకు తోడ్పడవచ్చు.



# 10 నుంచి బతుకమ్మ వేడుకలు

**బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సి.ఎస్ సంజయ జాజు సమీక్ష**



**ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 3:** తెలంగాణా సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వాణి ప్రసాద్, సీపీ హైదరాబాద్ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జిహెచ్ ఎం సీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎం.డి. నాగిరెడ్డి, సీపీ మల్కాజిగిరి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండలి అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం

**సమగ్ర కులగణన చేపట్టి చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి**
**వి. శ్రీనివాస్ గౌడ్**



**ముద్ర, హైదరాబాద్:** బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడంతో పాటు సమగ్ర కులగణన చేపట్టాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఓబీసీ ప్రజాప్రతి నిధుల ఫోరం పిలుపు మేరకు గన్‌పార్క్ వద్ద బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సమగ్ర కులగణన లేకపోవడం వల్ల బీసీలకు రిజర్వేషన్ల విషయంలో న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. 1931 తర్వాత బీసీల సమగ్ర కులగణన జరగకపోవడంతో ఈ వర్గాలకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం కొనసాగు తోందని, అన్ని రాజకీయ పార్టీలు ఈ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కన్వీనర్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, వట్టే జానయ్య యాదవ్, ఎస్. దుర్గయ్య గౌడ్, అయిలి వెంకన్న గౌడ్, ఎర్ర సత్యనారాయణ, బైర శేఖర్, అంబాల నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితిపై కవిత విమర్శలు

**భూపాలపల్లి ఆస్పత్రిలో సీలింగ్ కూలడంపై ఆగ్రహం..**
**'ఆపరేషన్ బ్లూకోడ్' పేరుతో తనిఖీలు**

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల పరిసితి అధ్వాన్నంగా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రి ఎస్ఎన్‌సీయూలో సీలింగ్ కూలిన ఘటనపై ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో చిన్నారుల మృతి ఘటన మరవకముందే భూపాలపల్లి ఆస్పత్రిలో సీలింగ్ కూలడం ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, మందులు, బెడ్ల కొరత వంటి సమస్యలు ఉన్నాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులను తెలంగాణ రక్షణ సేన నాయకులు సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రజల ముందుంచేలా 'ఆపరేషన్ బ్లూకోడ్' చేపడతామని తెలిపారు.ఇదిలా ఉండగా, వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఘటనలో పలువురు మృతి చెందడంపై కవిత సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అక్టోబర్ 3న జరిగిన ఈ ప్రమాదంలో మృతుల సంఖ్యపై ప్రారంభ నివేదికల్లో భిన్న సమాచారం ఉన్నప్పటికీ, తదుపరి నివేదికల్లో నలుగురు మహిళలు మృతి చెందినట్లు వెల్లడైంది.



# సీఆర్ఎఫ్‌లో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరం

**110 మందికి వైద్య పరీక్షలు..**
**ముందస్తు గుర్తింపే కీలకం: వైద్య నిపుణులు**




**ముద్ర, కొండాపూర్:** క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ (సీఆర్ఎఫ్)లో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్, సీఆర్ పాలిక్లినిక్, బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది.సీఆర్ఎఫ్ వైస్ ప్రెసిడెంట్, సీఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డా. కె. రజని, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ అధ్యక్షుడు, సీఆర్ఎఫ్ కార్యదర్శి కె. అజయ్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్ పాలిక్లినిక్ సీఈవో డా. శ్రీనివాసరావు, సీఓఓ కె. విజయలక్ష్మి , సీఆర్ఎఫ్ ట్రెజరర్ వి. చెన్నకేశవరావుతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్లు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ క్యాన్సర్‌పై పోరాటంలో ముందస్తు గుర్తింపు అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా ఖరీదైన వైద్య పరీక్షలు చేయించుకోలేని వెనుకబడిన వర్గాలకు ఇలాంటి ఉచిత అవగాహన, స్క్రీనింగ్ శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.శిబిరానికి సుమారు 110 మంది, ముఖ్యంగా వృద్ధులు, మధ్యవయస్కులు హాజరై వివిధ రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. బసవతారకం ఆసుపత్రి నిపుణులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అక్కడికక్కడే వైద్య సలహాలు అందించారు. క్యాన్సర్‌కు సంబంధించిన ప్రారంభ లక్షణాలు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారికి తదుపరి పరీక్షలు, చికిత్స, ఫాలోఅప్ గురించి సూచనలు చేశారు.సమాజ ఆరోగ్య కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నామని డా. రజని తెలిపారు. శిబిరం విజయవంతం కావడంలో సహకరించిన రోటరీ క్లబ్, బసవతారకం ఆసుపత్రి సిబ్బంది, సీఆర్ఎఫ్, మహిళా సంక్షేమ కేంద్రం, సీఆర్ పాలిక్లినిక్ సిబ్బంది, వాలంటీర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## బాలానగర్ డివిజన్ బి జే పీ అధ్యక్షుని జన్మదిన వేడుకలు




**ముద్ర, కూకట్‌పల్లి :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బాలానగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ బీజేపీ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు, డాక్టర్ కిరణ్ కుమార్‌ను శాలువాతో సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా ద్విచక్ర వాహనదారుల ప్రాణరక్షణ కోసం హెల్మెట్లను పంపిణీ చేశారు."అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న" అనే సదుద్దేశంతో, తన జన్మదినాన్ని ఒక సేవా కార్యక్రమంగా జరుపుకోవాలనే లక్ష్యంతో డాక్టర్ కిరణ్ కుమార్ ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా ఐడీఎల్ చెరువు కట్టపై వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని, తన పుట్టినరోజున నలుగురికి భోజనం పెట్టాలనే ఈ మంచి ఆలోచన చేయడం అభినందనీయమని పలువురు నాయకులు కొనియాడారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... డాక్టర్ కిరణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. డాక్టర్ కిరణ్ కుమార్‌కు తన హృదయపూర్వక ఆశీస్సులు అందజేస్తూ, మరెన్నో శుభ జన్మదిన వేడుకలు జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

## బకాయి మిల్లర్లపై కఠిన చర్యలు

**ముద్ర, హైదరాబాద్:** ప్రభుత్వ ధాన్యాన్ని తిరిగి చెల్లించకుండా బకాయి పడిన రైస్ మిల్లర్ల నుంచి సొమ్ము, ధాన్యం రికవరీకి పౌర సరఫరాల శాఖ కఠిన చర్యలకు సిద్ధమైంది. రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం కింద బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనుంది.దీనిలో భాగంగా అక్టోబర్ 5 నుంచి డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. తనిఖీలు, పంచనామాల నమోదు, వీడియో ఆధారాల సేకరణ, బకాయిల లెక్కింపు, రికవరీ రికార్డుల నిర్వహణపై శిక్షణ ఇస్తారు.మిల్లర్లకు షోకాజ్ నోటీసు జారీ చేసి సమాధానం ఇచ్చేందుకు ఏడు రోజుల గడువు ఇవ్వనున్నారు. గడువులోగా స్పందించకపోతే రైస్ మిల్లుల యంత్రాలు, వాహనాలు, బ్యాంకు ఖాతాలు తదితర ఆస్తులను జప్తు చేయడంతో పాటు అవసరమైతే భూములు, ఇళ్లను కూడా సీజ్ చేసి బహిరంగ వేలం ద్వారా బకాయిలను రాబట్టేలా చర్యలు చేపట్టనున్నారు.

## అడ్వకేట్ హుస్సేన్‌కు ఘన సన్మానం



**ముద్ర కూకట్‌పల్లి :** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా వక్ఫ్ పరిరక్షణ మరియు సమన్వయ కమిటీ సభ్యుడిగా నియమితులైన అడ్వకేట్ హుస్సేన్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆయనకు శాలువాప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సమన్వయంలో అడ్వకేట్ హుస్సేన్ చట్టపరమైన పరిధిలో నిజాయితీ, నిబద్ధత మరియు పారదర్శకతతో వ్యవహరిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం అడ్వకేట్ హుస్సేన్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన తెలంగాణ ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి, పార్టీ నాయకులకు మరియు కమ్యూనిటీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, ముస్లిం మైనారిటీ నాయకులు, మసీదు కమిటీ ప్రతినిధులు, న్యాయవాదులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులకు సన్మానం



**ముద్ర, కూకట్‌పల్లి:** సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలు ఇటీవల బాలానగర్ డివిజన్ పరిధిలోకి మారిన నేపథ్యంలో జింకలవాడలోని సామాజిక భవనంలో శనివారం ప్రత్యేక పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఆర్ నగర్ ఏసీపీ, బాలానగర్ డివిజన్ ఏసీపీ నరేష్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ స్వామిగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తూము ఎల్లారావు, అశోక్ ముదిరాజ్, శ్రీనివాస్, వెంకటేష్ యాదవ్, సుధాకర్ రెడ్డి, కన్నయ్య, రాజు, పెద్ద రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## మెదక్ అభివృద్ధి చేసి చూపిస్తా



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తెలిపారు. మెదక్, రామాయంపేట పట్టణాలను భారీ స్థాయిలో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దుతానన్నారు. రామాయంపేటలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. మెదక్ లో సర్కిళ్ల ఆధునీకరించేందుకు రూ.2 కోట్లు మంజూరు చేసి ఇటీవల శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రధాన చౌరస్తా శివాజీ విగ్రహం వద్ద, పోస్ట్ ఆఫీస్ వద్ద అంబేద్కర్ సర్కిల్, బోధన్ చౌరస్తాలో ధ్యాన్ చంద్ విగ్రహం పనులు ప్రారంభం అవుతాయని, ఇందుకు సంబంధించిన నమూనాలు విడుదల చేశారు. గత అనేక సంవత్సరాలుగా మెదక్ ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధిని చూడాలని ఎదురుచూస్తున్నారన్నారు. ఇకపై మెదక్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు.రహదారులు, డ్రైనేజీ, పట్టణ మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు తదితర రంగాల్లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత మెదక్, రామాయంపేట పట్టణానికి మరింత ప్రత్యేకత, అందం చేకూరడంతో పాటు ప్రజలకు ఆకర్షణీయమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని భారీ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 04.10.2026
www.mudranews.in | @mudranews



## మజ్జిగ : శరీరానికి పోషకాలు అందిస్తుంది

మజ్జిగలో ప్రోటీన్, కాల్షియం, పొటాషియం, విటమిన్ B12 వంటి పోషకాలు లభిస్తాయి. రోజువారీ ఆహారంలో పరిమితంగా చేర్చుకోవడం ద్వారా పోషకాహారానికి తోడ్పడుతుంది.



## ప్రాణాలతో బయటపడ్డ యువకుడు

*** పెట్రోల్ కోసం వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకున్న రోజు వారి కూలి.**



**ముద్ర చిగురుమామిడి :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముల్కనూర్‌లో పెట్రోల్ బంక్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామానికి చెందిన తాళ్లపల్లి పవన్ కుమార్ గౌడ్ ముల్కనూర్‌లోని ఎంఎం వైన్స్‌లో రోజువారీ పనులు ముగించుకుని శుక్రవారం రాత్రి సుమారు 10:40 గంటలకు స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు.మార్గమధ్యలో ముల్కనూర్ శివారులోని భారత్ పెట్రోల్ బంక్‌కు పెట్రోల్ కోసం వెళ్లాడు. అయితే బంక్‌లో పెట్రోల్ నిల్వ లేదనే విషయాన్ని తెలియజేసే 'నో స్టాక్' బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో పాటు విద్యుత్ దీపాలు ఆర్పివేసి, వినియోగదారులు లోపలికి రాకుండా కొబ్బరి తాడుతో మార్గాన్ని కట్టివేసినట్లు బాధితుడు ఆరోపించాడు. దీంతో చీకట్లో తాడు కనిపించక పవన్ కుమార్ గౌడ్ ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపాడు.

ఈ ఘటనపై చికిత్స తీసుకున్న అనంతరం అక్టోబర్ 3న సంబంధిత పోలీస్ స్టేషన్‌లో పవన్ కుమార్ గౌడ్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. అలాగే పెట్రోల్ బంక్ నిర్వహణ, భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామాల్లో బెల్ట్ షాపులు మూసివేయాలి

**: ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో మద్యం వినియోగం అధికంగా ఉందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అందుబాటు పెరగడం ఆందోళనకరమని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పేర్కొంది. గ్రామాల్లో నిర్వహిస్తున్న అన్ని బెల్ట్ షాపులను మూసివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS) గణాంకాల ప్రకారం తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల పురుషుల్లో 46.6 శాతం, పట్టణ ప్రాంతాల్లో 36.3 శాతం మంది మద్యం సేవిస్తున్నారని ఫోరం అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం అధికంగా ఉండటానికి గ్రామగ్రామాన బెల్ట్ షాపుల విస్తరణ కూడా ఒక కారణంగా ఉందని పేర్కొన్నారు. రెండు దశాబ్దాల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ప్రధానంగా మండల కేంద్రాలకే పరిమితమై ఉండేదని, ప్రస్తుతం గ్రామాల్లోనే సులభంగా లభిస్తోందని తెలిపారు. మద్యం వినియోగం వల్ల ప్రజారోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు, కుటుంబ జీవితం ప్రభావితమవుతున్నాయని, మహిళలపై నేరాలు సహా పలు సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ఆర్థిక ప్రయోజనాల్లో గణనీయమైన భాగం మద్యం కొనుగోళ్లకు ఖర్చవుతోందని ఫోరం అభిప్రాయపడింది. తద్వారా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం చేస్తున్న వ్యయం పరోక్షంగా తిరిగి ప్రభుత్వ ఖజానాకు చేరుతోందని పేర్కొంది. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం, సామాజిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోని బెల్ట్ షాపులను మూసివేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పద్మనాభరెడ్డి కోరారు.

## కరీంనగర్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్‌లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ సోమేడి వేనుప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నగరంలోని 29వ డివిజన్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.24 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు, రూ.40 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు, డ్రైన్ పైప్‌లైన్, రూ.56 లక్షలతో మంచినీటి పైపుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కరీంనగర్ నగర పాలక సంస్థలో భాజపా పాలక వర్గం ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

## బొల్లారం ఆయుధాల చోరీలో బిగ్ ట్విస్ట్..

**- లోపలి వ్యక్తులే సూత్రధారులు**

**ముద్ర, హైదరాబాద్ :** బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ బెల్లా ఫామ్ నిబంధనలను ఉల్లంఘించి ఆయుధాల చోరీకి పాల్పడిన కేసులో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీసులు సంచలనాత్మక విషయాలను వెల్లడించారు. మల్కాజిగిరి పోలీసులు, ఎస్ఓటీ (SOT), టాస్క్ ఫోర్స్ , ఇంటెలిజెన్స్ విభాగాల సంయుక్త దర్యాప్తులో ఈ కేసు గుట్టురట్టయ్యింది. కేసులోని ప్రధాన నిందితుడు మల్లేష్‌ను సెప్టెంబర్ 11న అదుపులోకి తీసుకుని, అతడు గన్నీ బ్యాగుల్లో దాచిన తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి తెలిపారు. 10 రోజుల పోలీసు కస్టడీ విచారణలో మల్లేష్ నేరచరిత్ర, చోరీ వెనుక ఉన్న పక్కా ప్రణాళిక బయటపడిందని ఆమె వివరించారు. 2025 వరకు మేఘాలయ, జమ్మూ, ఊటీ ప్రాంతాల్లో పనిచేసిన మల్లేష్, అక్కడి నుంచి మద్రాస్ రెజిమెంట్‌కు బదిలీ అయ్యాడు. గతంలోనూ ఇతనిపై నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో రెండు దొంగతనం కేసులు నమోదు కాగా, మొదటి నుంచీ నేరపూరిత మనస్తత్వం కలిగి ఉన్నాడని అధికారులు స్పష్టం చేశారు. ఆర్మీ రిటైర్మెంట్ తర్వాత ఫ్లాట్ కొనుగోలు, సొంత ఇల్లు నిర్మాణం చేపట్టడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఖర్చయి పోవడంతో, ఎలాగైనా త్వరితగతిన ధనవంతుడు కావాలనే ఉద్దేశంతో ఆయుధాల దొంగతనానికి ఒడిగట్టాడు. 2022లోనే కలకత్తాలో సివిలియన్ అయిన బీర్బల్ షా ద్వారా అక్రమ ఆయుధ వ్యాపారి అవల్ దెయ్‌తో పరిచయం పెంచుకుని కంట్రీమేడ్ తపంచాను కొనుగోలు చేసినట్లు తేలింది.

# గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి తుది కసరత్తు

**జలాశయ పనులు దాదాపు 98 శాతం పూర్తి**
**భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను త్వరగా పరిష్కరించాలి**
**అనుమతులు, కాలువల పనులకు గడువులతో కార్యాచరణ: మంత్రి ఉత్తమ్**



**ముద్ర, హైదరాబాద్ :** గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి అడ్డుగా ఉన్న పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు ద్వారా 1.06 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయంలో శనివారం గౌరవెల్లి ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు నీటిపారుదల, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పనులవారీగా స్పష్టమైన గడువులు నిర్ణయించి, అర్హులకు పరిహారం త్వరగా చెల్లించాలని ఉత్తమ్ ఆదేశించారు. ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన సమస్యలను వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి జలాశయం ఇందిరమ్మ వరద కాలువ పథకంలో భాగంగా నిర్మిస్తున్నారు. 2008లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.410 టీఎంసీల నుంచి 8.230 టీఎంసీలకు పెంచారు. జలాశయ నిర్మాణ పనులు ప్రస్తుతం దాదాపు 98 శాతం పూర్తయ్యాయి. అయితే పర్యావరణ అనుమతులు, మిగిలిన భూసేకరణ, పునరావాసం, ప్రధాన, పంపిణీ కాలువల పనులు పూర్తికావాల్సి ఉంది. ప్రాజెక్టుపై ఇప్పటి వరకు రూ.1,343.59 కోట్లు ఖర్చు కాగా, మరో రూ.114.389 కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. రూ.1,457.979 కోట్ల సవరించిన అంచనాలను తదుపరి మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టేందుకు పంపాలని మంత్రి సూచించారు.

ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండా జలాశయ విస్తరణ చేపట్టిన అంశం ఎన్‌జీటీకి చేరడంతో, అనుమతి వచ్చే వరకు తదుపరి నిర్మాణ పనులు చేపట్టరాదని ఆదేశాలు జారీ అయ్యాయి. అక్టోబర్ 8న జరిగే పర్యావరణ అనుమతి ప్రతిపాదన పరిశీలనకు అవసరమైన పత్రాలను సిద్ధం చేయాలని, అక్టోబర్ 16న ఎన్‌జీటీ విచారణకు తాజా న్యాయపరమైన పరిణామాలు, ప్రాజెక్టు రికార్డులు సమర్పించాలని ఉత్తమ్ ఆదేశించారు.

జలాశయానికి అవసరమైన 3,870 ఎకరాల్లో 3,850 ఎకరాలు ఇప్పటికే సేకరించారు. మిగిలిన 20 ఎకరాలకు పరిహారం జమ చేసినట్లు మంత్రి తెలిపారు. కాలువల భూసేకరణ, పంపిణీ కాలువల అంచనాలు, టెండర్లకు గడువులు నిర్ణయించాలని సూచించారు. వచ్చే సాగు సీజన్‌కు నీటిని అందించేలా కాలువల వ్యవస్థను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) మధుసూదన్ రావు, సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపన కమిషనర్ శివకుమార్ నాయుడు, సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి తదితర నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డీమార్ట్ ఆదాయం ₹19,206 కోట్లు

**ముద్ర, ఢిల్లీ :** ప్రధాన రిటెయిల్ వ్యాపార సంస్థ డీమార్ట్ ఈ ఏడాది రెండో త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. జులై– సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.19,206.18 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో నమోదైన రూ.16,218.79 కోట్లతో పోలిస్తే 18.4 శాతం అధికం. ఈ మేరకు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంతో పోలిస్తే.. డీమార్ట్ ఆదాయం 4.7 శాతం వృద్ధిని నమోదు చేసింది.

## పుష్కర ఘాట్ల పనులను వేగవంతం చేయాలి



**ముద్ర, ధర్మపురి:** పుష్కర ఘాట్ల పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ రాజుగౌడ్ ఆదేశించారు. 2027 పుష్కర మహోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలోని గోదావరి నది తీరంలో కొనసాగుతున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి..రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన రక్త పరీక్షలు, తాగునీరు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను..

**- ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు**



**ముద్ర, హైదరాబాద్ :** పాతబస్తీ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా గుర్తింపు పొందిన ఎంఐఎం (AIMIM) శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తికర చర్చకు తెరలేపాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానో లేదో తెలియదని, ప్రస్తుతానికి అసలు ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన కూడా తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాలుగా చురుగ్గా రాజకీయాల్లో ఉంటూ వరుస విజయాలు సాధిస్తున్న అక్బరుద్దీన్ చేసిన ఈ అనూహ్య ప్రకటన ఇప్పుడు పాతబస్తీ వ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది.

**"నేను ముసలోడిని అయిపోయాను.."**

తన భవిష్యత్తు పోటీపై మాట్లాడిన అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన కామెంట్స్ చేశారు. "నేను ముసలోడిని అయిపోయాను. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు. అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా లేదు.. నేనైతే చేయను" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఎంఐఎం పార్టీకి పాతబస్తీలో ప్రధాన బలంగా, అసెంబ్లీలో ప్రతిపక్షాలను సమర్థవంతంగా ఎదుర్కొనే కీలక నాయకుడిగా ఉన్న అక్బరుద్దీన్ నోటి నుంచి ఈ మాటలు రావడం పార్టీ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది.

**పాతబస్తీ రాజకీయాల్లో కొత్త మలుపు?**

అక్బరుద్దీన్ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు అంతరార్థం ఏమిటనే దానిపై రాజకీయ విశ్లేషకులు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. నిజంగానే ఆయన రాబోయే ఎన్నికల నాటికి పోటీకి దూరంగా ఉంటారా లేదా పార్టీలో తర్వాతి తరం నాయకత్వానికి దారి ఇచ్చేందుకు ఈ వ్యాఖ్యలు చేశారా అనే కోణంలో చర్చ నడుస్తోంది. పాతబస్తీ నుంచి ఎంఐఎంను తిరుగులేని శక్తిగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించిన అక్బరుద్దీన్ ఒకవేళ నిజంగానే పోటీ నుంచి తప్పుకుంటే, అది పాతబస్తీ రాజకీయాల్లో ఒక కొత్త మలుపుగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రైస్ మిల్లర్లకు తెలంగాణ సర్కార్ వార్నింగ్.. ఆస్తులు జప్తే

**CMR బకాయిలపై పౌర సరఫరాల శాఖ కఠిన చర్యలు**
**RR యాక్ట్ కింద బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్**
**అక్టోబర్ 5 నుంచి అధికారులకు ప్రత్యేక శిక్షణ**
**షోకాజ్ నోటీసులకు 7 రోజుల్లో సమాధానం ఇవ్వాల్సిందే**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వానికి రైస్ మిల్లర్లు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (CMR) బకాయిలపై పౌర సరఫరాల శాఖ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రజల సొమ్ముతో కనీస మద్దతు ధర (MSP) చెల్లించి కొనుగోలు చేసిన ప్రభుత్వ ధాన్యాన్ని అప్పగించకుండా దారి మళ్లించాలని చూసే డిఫాల్ట్ మిల్లర్లపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వానికి రావలసిన బియ్యాన్ని తక్షణమే అప్పగించాలని, లేకపోతే ఆస్తులను కోల్పోవడానికి సిద్ధపడాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ (RR) చట్టం ప్రకారం బకాయిలు ఉన్న మిల్లర్ల నుంచి నిధులను రాబట్టడంతో పాటు ఆస్తులను వేగంగా స్వాధీనం చేసుకోవడానికి పౌర సరఫరాల శాఖ ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది.

**7 రోజుల్లోగా సమాధానం ఇవ్వాల్సిందే**

చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా, ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా డిఫాల్ట్ మిల్లర్ల ఆస్తులను వేగంగా జప్తు చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పౌర సరఫరాల అధికారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ అక్టోబర్ 5వ తేదీ నుంచి హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి (MCRHRD) సంస్థలో ఈ ప్రత్యేక శిక్షణ ప్రారంభం కానుంది. ఈ తనిఖీల ప్రక్రియను మరింత పటిష్టం చేస్తూ ప్రభుత్వం కొత్త నిబంధనలను సైతం తీసుకొచ్చింది. అధికారుల అకస్మాత్తు తనిఖీలలో గోదాముల్లో ఉండాల్సిన దానికంటే ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు తేలితే తక్షణమే పౌర సరఫరాల శాఖ షోకాజ్ నోటీసులు జారీ చేస్తుంది. నోటీసు అందుకున్న మిల్లర్లు కేవలం ఏడు రోజుల గడువులోనే వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. సదరు గడువు దాటితే ఎలాంటి మినహాయింపులు లేకుండా నేరుగా ఆస్తుల జప్తుతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 04.10.2026
www.mudranews.in | @mudranews


## మజ్జిగ : రోగనిరోధక శక్తికి సహకారం

మజ్జిగలోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియా పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఆరోగ్యకరమైన గట్ రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది.



## ఆర్టీసీ ప్రయాణికులకు ఆన్ లైన్ సౌకర్యం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదగిరిగుట్ట నుండి దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆన్ లైన్ లో టికెట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం వరకు డీలక్స్ బస్సులు నడుపుతున్నామని ఆయన అన్నారు. ప్రతి రోజూ ఉదయం 6.00 గంటలకు యాదగిరిగుట్ట డిపో నుండి బయలుదేరి, 06.20 నిముషాలకు భువనగిరి, 06.45 నిముషాలకు ఘటకేసర్, 07.15 నిముషాలకు ఉప్పల్ /నల్లచెరువు ద్వారా మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ద్వారా శ్రీశైలం వెళుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసు రిజర్వేషన్ నెం.1915 ద్వారా బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. శ్రీశైలం నుండి సాయంత్రం 15.45 నిముషాలకు బయలుదేరి తిరిగి యాదగిరిగుట్ట కు వస్తుందన్నారు. అదే విధంగా, యాదగిరిగుట్ట నుండి రాయచూర్ కు 12.30, 15.00, 15.45, 16.30, 17.00 గంటలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడుపుతున్నామని అన్నారు. ప్రతి డీలక్స్ బస్సు భువనగిరి, ఘట్కేసర్, ఉప్పల్, హైదరాబాద్ (ఏం జి బి ఎస్), మహబూబ్ నగర్, మక్తల్ ద్వారా రాయచూర్ వెళ్లి మరుసటి రోజు యాదగిరిగుట్ట కి వస్తుందన్నారు. ఈ బస్సుల ఆన్ లైన్ రిజర్వేషన్ల కొరకు ఫోన్ నంబర్ 9063404773 ను సంప్రదించాలని తెలిపారు.



## ముందస్తు బతుకమ్మ వేడుకలు




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 3 :** శ్రీ కృష్ణప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్ పర్సన్ నిష్టాశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో చిన్నారులు రకరకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఉపాధ్యాయులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడిగా పసునూరి నరేంద్ర చారి



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో పసునూరి నరేంద్ర చారి ఘన విజయం సాధించారు. అలాగే సంఘం ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్ చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కొండమల్లేపల్లి మండలంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా మనమయ సంఘం ఉపాధ్యక్షులు సొనగంటి గోవర్ధన చారి, అధ్యక్షులు సల్లోజు శ్రీనివాస చారి, INTUC జిల్లా కార్యదర్శి నారోజు సైదాచారి, గౌరవ అధ్యక్షులు కర్నెకంటి జంగాచారి, మాజీ అధ్యక్షులు పసునూరి శేఖర్ చారి, చెన్నయ్య చారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి.ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన అధ్యక్షుడిగా పసునూరి నరేంద్ర చారిని, ప్రధాన కార్యదర్శిగా పోలోజు మల్లేష్ చారిని ఎన్నుకున్నారు.

# సూర్యఘర్ పథకం అందరికీ ఉపయోగకరం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం ప్రతి సామాన్యుడికి ఎంతో ఉపయోగకరమని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. శనివారం సేవా సేతు అభియాన్ – పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై భువనగిరి పట్టణంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూఇంటి పైకప్పుపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా నెల నెలా వచ్చే కరెంటు బిల్లు భారం తగ్గడమే కాకుండా, మిగిలిన విద్యుత్ ను ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ₹78,000 వరకు సబ్సిడీ అందిస్తోందని, 0 డౌన్ పేమెంట్ తో రుణ సౌకర్యం కూడా కల్పిస్తున్నారని తెలిపారు. భువనగిరి పట్టణ ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సోలార్ కంపెనీ ప్రతినిధులు పథకం వివరాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలను ప్రజలకు




వివరించారు. సోలార్ ప్యానల్ ద్వారా 25 సంవత్సరాల పాటు విద్యుత్ పొదుపు పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగాళ్ళ పల్లి రవి కుమార్ మాజీ కౌన్సిలర్ కుక్క దుగు సోమయ్య విద్యుత్ శాఖ ఏడీ ఏఈ, లైన్ మెన్ లు ఈ, స్థానిక నాయకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

**వార్డులలో అభివృద్ధి నిర్మాణ పనులు ప్రారంభం**

భువనగిరి పట్టణంలోని 4, 8, 15, 32, 33వ వార్డులలో వార్డుకు రూ.2.00 లక్షల చొప్పున రూ.10.00 లక్షలతో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో మురికి కాలువలు, సి.సి. రోడ్లు, అంతర్గత మురికి కాలువ నిర్మాణాలు, మిని వాటర్ ట్యాంకులు, మురికి కాలువ పై స్లాబ్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాయిని అరుణ పూర్ణచందర్, తహెర బబ్లూ మజర్ పాషా, నాజియా రహమాన్ జహంగీర్, బర్రె సంఘవి కరుణాకర్ నాకోటి నగేష్, అధికారులు డీ ఈ ఈ, ఏం ఏ ఈ, వార్డు ప్రజలు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగ ఆశావహులకు 45 రోజుల ఉచిత శిక్షణ

**అక్టోబర్ 4న నాలుగు కేంద్రాల్లో ఎంపిక పరీక్షలు**

**ముద్ర సూర్యాపేట, అక్టోబర్ 3:** పోలీసు ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖ సువర్ణావకాశం కల్పిస్తోంది. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు 45 రోజుల పాటు ఉచిత పోలీసు శిక్షణ అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు.ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు అక్టోబర్ 4న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు.నియోజకవర్గాల వారీగా పరీక్షా కేంద్రాలుసూర్యాపేట నియోజకవర్గం: సూర్యాపేట, ఆత్మకూరు, పెనపహాడ్, చివ్వెంల మండలాల అభ్యర్థులు సూర్యాపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరు కావాలి. పరీక్ష నిర్వహణ బాధ్యతలను సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య చేపట్టనున్నారు.కోదాడ నియోజకవర్గం:



కోదాడ, చిలుకూరు, అనంతగిరి, మునగాల, నడిగూడెం, మోతె మండలాల అభ్యర్థులు కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్షకు హాజరు కావాలి. కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించనున్నారు.హుజూర్‌నగర్ నియోజకవర్గం: హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల అభ్యర్థులు హుజూర్‌నగర్‌లోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో పరీక్ష రాయాలి. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో పరీక్ష జరుగుతుంది.తుంగతుర్తి నియోజకవర్గం: తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్, అర్వపల్లి, తిరుమలగిరి, నాగారం మండలాల అభ్యర్థులు తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షకు హాజరు కావాలి. నాగారం సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించనున్నారు.అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకురావాల్సినవితెలంగాణ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డుకు సమర్పించిన పోలీసు ఉద్యోగ దరఖాస్తుఉచిత శిక్షణ కోసం సమర్పించిన స్క్రీనింగ్ పరీక్ష దరఖాస్తుఆధార్ కార్డు జిరాక్స్400 మందికి 45 రోజుల శిక్షణస్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 400 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 45 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 200 మందికి, కోదాడలో మరో 200 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణతో పాటు రాత పరీక్షకు అవసరమైన అంశాలపై ప్రత్యేక శిక్షణ, నాణ్యమైన స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. నిష్ణాతులైన శిక్షకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలిపరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ కె. నరసింహ సూచించారు. ద్విచక్ర వాహనాలపై వేగంగా ప్రయాణించకుండా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణా, బస్సులను వినియోగించి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్క్రీనింగ్ పరీక్షకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ కోరారు.

# కోదాడ ఆసుపత్రిలో శరవేగంగా నూతన భవన నిర్మాణాలు

**రూ.26 కోట్లతో 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్..**

**ప్రజలకు నాణ్యమైన వైద్యమే ధ్యేయం**

**కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్**

**ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 3:** కోదాడ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని శనివారం స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం 30 పడకలుగా



ఉన్న కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.26 కోట్లు మంజూరు చేసిందని, నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఆసుపత్రి పునరుద్ధరణతో పాటు నూతనంగా నిర్మించిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ విభాగాలు పూర్తికావడంతో వాటిని ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు.అన్ని రకాల ఉచిత వైద్య సేవలుశనివారం నుంచే ఆసుపత్రిలో అన్ని రకాల ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినందున కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, లక్ష్మారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెండెం వెంకటరమణ, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వైద్యులు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డా. బోయ జంగయ్య 84వ జయంతి

**ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 3:** తెలంగాణ సాహితీ తేజోమూర్తి, ప్రముఖ రచయిత డా. బోయ జంగయ్య 84వ జయంతి సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో ప్రత్యేక సాహిత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా. బోయ జంగయ్య నవల సాహిత్య సంపుటిని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఏ. వాణి ప్రసాద్, IAS ఆవిష్కరించారు. బోయ జంగయ్య సాహిత్యం తెలంగాణ సామాజిక జీవనాన్ని, అణగారిన వర్గాల జీవిత అనుభవాలను, మానవ సంబంధాలను తనదైన శైలిలో ప్రతిబింబించిందని వక్తలు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాహితీవేత్తలు డా.




బోయ జంగయ్య రచనా ప్రస్థానాన్ని, నవలలు–కథలు–కవిత్వంలో ఆయన చేసిన విశిష్ట కృషిని వివిధ కోణాల్లో విశ్లేషించారు. ఆచార్య కాసిం, కోయి కోటేశ్వరరావు, గడ్డం మల్లేశం, కాసుల ప్రతాపరెడ్డి, దున్న యాదగిరి, గోగు శ్యామల, బి.ఎస్. రాములు బోయ జంగయ్య సాహిత్య ప్రాసంగికతను, సమాజంపై ఆయన రచనల ప్రభావాన్ని వివరించారు. .బోయ జంగయ్య రచనలు కేవలం సాహిత్య సృజన మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజల జీవన వాస్తవాలకు అద్దం పట్టే సామాజిక దస్తావేజులుగా నిలిచాయని అభిప్రాయపడ్డారు. ఆయన రచనల్లోని సామాజిక స్పృహ, మానవీయ విలువలు, అణగారిన వర్గాల పట్ల నిబద్ధత నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. డా. బోయ జంగయ్య సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు మరింత విస్తృతంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. ఎన్. బాలాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు మరియు బోయ జంగయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో పేదల ఇంటికే సంక్షేమం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 3 :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో రూ.6.65 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ప్రారంభించి, రూ.2.50 కోట్ల బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో 35 నెలల్లో రూ.13.50 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇళ్లలో 2.25 లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు.




**నారాయణపురంలో రూ.200 కోట్లతో క్యాన్సర్ ఆసుపత్రి**

సత్తుపల్లి మండలం నారాయణపురంలో షిరిడీ సాయి జనమంగళ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.200 కోట్లకు పైగా వ్యయంతో ఉచిత క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ, గిరిజన పేదలకు ఈ ఆసుపత్రి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ముందస్తు గుర్తింపు, చికిత్సతో క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని, ఒక్కొక్కరికి రూ.7 వేల విలువైన హెచ్‌పీవీ టీకాలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రికి అవసరమైన రహదారి, మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

## పారిశుధ్య కార్మికులకు సన్మానం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, భువనగిరి పట్టణ భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం నలగొండ చౌరస్తా చత్రపతి శివాజీ విగ్రహం వద్ద పారిశుద్ధ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు గాయపాక పృథ్వీరాజ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా 19వ వార్డు కౌన్సిలర్ బండారు స్వర్ణలత, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చెరుకు వెంకటేష్ హాజరై మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి ఆర్భాటాలు లేకుండా, నిత్యం పరిసరాల పరిశుభ్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శ్రమిస్తున్న పారిశుద్ధ కార్మికులే నిజమైన 'సేవా యోధులు' అని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలు కన్న 'స్వచ్ఛ భారత్' మిషన్‌ను అంకితభావంతో క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తున్నది పారిశుద్ధ కార్మికులేనని, వారి సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పట్నం శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, నాయకులు బండారు లోకేశ్వర్, జిల్లా కార్యదర్శి మేడి కోటేష్. రాష్ట్ర నాయకులు గూడెపు బిక్షపతి, రాళ్ళబండి కృష్ణాచారి, కలకొండ రాము, ఎస్సీ మోర్చా మాజీ పట్టణ అధ్యక్షులు స్వామి, కారుపాటి రాజు, రమేష్, కోటి, అందే విజయ్ కార్యవర్గ సభ్యులు, తెలిపారు.



## 12న అల్లీపురంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 3 :** అల్లీపురంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఈ నెల 12న భూమిపూజ నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సుమారు 20 ఎకరాల్లో, రూ.100 కోట్ల విలువైన భూమిలో ఆలయాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. అమరావతిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నమూనా ఆధారంగా ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. భూమిపూజకు పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.



## ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

**ముద్ర, బీబీనగర్:** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని బీబీనగర్ ప్రాథమిక వ్యవసాయ ప్రాథమిక సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని వెంకిర్యాల, పల్లెగూడెం గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో పల్లెగూడెం సర్పంచ్ అప్పారెడ్డి బలరాం రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గందు బసవయ్య యాదవ్, నాయకులు చింతల లక్ష్మీనారాయణ, చింతల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఉప్పలాంచి శ్రీకాంత్, అంబేపు బాలరాజ్, సంజీవరెడ్డి, చెరుకు బాలరాజు గౌడ్ లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



## బిజెపి తీరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 3 :** దేశంలో బిజెపి వ్యవహరిస్తున్న తీరు వల్ల ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలుగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కును తొలగించడం తీవ్రమైన నేరమని, బిజెపి మొత్తం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. గిరిప్రసాద్ భవన్ లో ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సిపిఐ ఖమ్మం జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.దేశవ్యాప్తంగా ఓటు పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలు రూపుదిద్దుకుంటున్నాయని, యువతలో ప్రశ్నించే తత్వం పెరగడం శుభపరిణామమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల దేశంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్నాయని, 90 శాతం సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని మండిపడ్డారు. పేదల సంక్షేమంపై వితండవాదం చేసే మేధావులు, సంపన్న వర్గాలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీల పేరుతో రద్దు చేస్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. పెరిగిన ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు.ఇదే సమయంలో రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తన తీరును మార్చుకోవాలని కూనంనేని సూచించారు. కేవలం విపక్షాలపై దాడులు చేయడమే పనిగా పెట్టుకోకుండా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని హితవు పలికారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, పింఛన్ల పెంపు, ఫీజు రీయింబర్స్ మెంట్ హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 22ఎ పేరుతో దశాబ్దాలుగా పేదలు సాగుచేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకుంటే సహించేది లేదని, భూపోరాటాలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ విజయం కోసం సిపిఐ శ్రేణులు కృషి చేయాలని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

ఆదివారం 04.10.2026

www.mudranews.in | @mudranews




### మజ్జిగతో జీర్ణక్రియకు మేలు

మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థకు సహాయపడతాయి. భోజనం తర్వాత మజ్జిగ తీసుకుంటే కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు కొంత తగ్గవచ్చు.



# బొల్లారం ఆయుధాల చోరీ కేసులో 8 మంది అరెస్టు

**బ్యాంకులు, నగల దుకాణాలు, సంపన్నులను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి కుట్ర**

**మాజీ హవల్దార్‌తో పాటు ముగ్గురు మాజీ సైనికులు, మరో నలుగురు అరెస్ట్**



**ముద్ర, మల్కాజ్‌గిరి:** బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ కోటే, మ్యాగజైన్ నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి చోరీ చేసిన కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మాజీ హవల్దార్‌తో పాటు మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ తెలిపారు.ఆగస్టు 31న బెటాలియన్ సిబ్బంది ఆయుధాల భద్రపరిచే గదిలోని తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. పరిశీలించగా నాలుగు ఏకే-203 రైఫిళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు 9ఎంఎం పిస్టళ్లు, ఒక సివిల్ పిస్టల్‌తో పాటు మ్యాగజైన్లు, బైనాక్యులర్లు, భారీగా మందుగుండు సామగ్రి కనిపించకపోవడంతో బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 207/2026 కింద కేసు నమోదు చేశారు.దర్యాప్తులో ప్రధాన నిందితుడిగా ఉప్పుతోళ్ల మల్లేశ్ అలియాస్ రాజు (37)ను పోలీసులు గుర్తించారు. ఇతను గతంలో 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌లో హవల్దార్‌గా పనిచేసినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 11న మల్లేశ్‌ను అరెస్ట్ చేసి విచారించగా చోరీకి సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. అతని తండ్రి ఇంటి నుంచి చోరీకి గురైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిలో కొంత భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. మల్లేశ్ తన బంధువు ఉప్పుతోళ్ల మల్లికార్జున్, స్నేహితుడు చెమ్మకర్ నిరంజన్‌తో కలిసి చోరీ చేసిన ఆయుధాలను ఉపయోగించి బ్యాంకులు, నగల దుకాణాలు, సంపన్నులను లక్ష్యంగా చేసుకుని పెద్ద మొత్తంలో ఆస్తి నేరాలకు పాల్పడాలని ప్రణాళిక రూపొందించాడు. చోరీ చేసిన ఆయుధాలను విక్రయించేందుకు పశ్చిమ బెంగాల్‌లోని బరాక్‌పూర్‌కు చెందిన అవి డే అలియాస్ ఒబి, బిర్బల్ షాలతో సంప్రదింపులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు.ఆయుధాల చోరీకి మల్లేశ్‌కు మాజీ మద్రాస్ రెజిమెంట్ సిబ్బంది కొండూరి శేషులు, వినోద్‌కుమార్, కుచారకంటి ప్రవీణ్ సహకరించినట్లు పోలీసులు తెలిపారు. కోటే, మ్యాగజైన్‌కు సంబంధించిన భద్రతా వ్యవస్థ, తాళాల వివరాలపై అవగాహన ఉన్నందున వీరి సహకారంతో ఆయుధాలను బయటకు తీసుకువచ్చినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.చోరీ చేసిన ఆయుధాల విక్రయానికి సంబంధించి నిందితులు వివిధ రకాల ధరలను నిర్ణయించినట్లు పోలీసులు తెలిపారు. పిస్టల్‌కు సుమారు రూ.3 లక్షలు, పెద్ద ఆయుధానికి సుమారు రూ.5 లక్షల వరకు ధర పలుకుతుందని, మందుగుండు సామగ్రికి అదనంగా ధర నిర్ణయించినట్లు వెల్లడించారు.ఇదిలా ఉండగా, 2022లో బరాక్‌పూర్/కోల్‌కతాలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మల్లేశ్ దేశవాళీ తుపాకీ, బుల్లెట్‌ను కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో అవి డే, బిర్బల్ షాల పాత్ర ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ ఆయుధాన్ని కూడా సెప్టెంబర్ 23న మల్లేశ్ తండ్రి ఇంటి మొదటి అంతస్తు నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనంనిందితుల నుంచి నాలుగు ఏకే-203 రైఫిళ్లు, ఐదు ఏకే-203 మ్యాగజైన్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, మూడు ఇన్సాస్ మ్యాగజైన్లు, ఆరు 9ఎంఎం పిస్టళ్లు, 12 పిస్టల్ మ్యాగజైన్లు, ఒక 6.35 బోర్ సివిల్ పిస్టల్, మూడు బైనాక్యులర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 1,156 9ఎంఎం పిస్టల్ రౌండ్లు, 720 ఏకే-203 రౌండ్లు, 36 ఇన్సాస్ రౌండ్లు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మొత్తం 1,912 రౌండ్ల మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఎనిమిది మంది నిందితులుఈ కేసులో ప్రధాన నిందితుడు మల్లేశ్‌తో పాటు కొండూరి శేషులు (36), వినోద్‌కుమార్ (34), కుచారకంటి ప్రవీణ్ (37), పశ్చిమ బెంగాల్‌కు చెందిన అవి డే అలియాస్ ఒబి (32), బిర్బల్ షా (27), ఉప్పుతోళ్ల మల్లికార్జున్ (39), చెమ్మకర్ నిరంజన్ (39)లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో కొందరు మాజీ సైనిక సిబ్బంది కాగా, మిగిలిన వారు వివిధ వృత్తుల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ప్రధాన నిందితుడు మల్లేశ్‌పై గతంలో అచ్చంపేట, అమ్రాబాద్ ప్రాంతాల్లో ఇళ్ల దొంగతనాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు, మరో నిందితుడు అవి డేపై గతంలో ఆయుధాల చట్టం కింద కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.మల్లేశ్‌ను సెప్టెంబర్ 11న అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయ రిమాండ్‌కు పంపారు. అనంతరం సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 1 వరకు పోలీస్ కస్టడీలో విచారించారు. మిగిలిన ఏడుగురిని అక్టోబర్ 3న కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఉగ్రవాద లేదా తీవ్రవాద సంబంధాలు ఇప్పటివరకు గుర్తించలేదని సీపీ బి. సుమతి వెల్లడించారు.

## భారత సరిహద్దులో పాక్ పౌరుల కాల్చివేత..

**భారత రాయబారికి పాక్ సమన్లు**



**ముద్ర, డెస్క్**

పంజాబ్‌లోని భారత్-పాక్ సరిహద్దులో ఇద్దరు పాకిస్తాన్ చొరబాటుదారుల్ని భారత భద్రత బలగాలు (బీఎస్ఎఫ్) కాల్చిచంపిన సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై పాకిస్తాన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ పౌరుల్ని కాల్చి చంపడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన పాకిస్తాన్.. భారత రాయబారికి సమన్లు జారీ చేసింది. ఇండియన్ డి అఫైర్స్‌గా పిలిచే డా.సత్యంజల్ పాండే ప్రస్తుతం పాకిస్తాన్, ఇస్లామాబాద్‌లో భారత రాయబారిగా ఉంటున్నారు.ఆయన తాత్కాలిక రాయబారిగా మాత్రమే అక్కడ కొనసాగుతున్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఇండియా.. పాకిస్తాన్‌లో పూర్తిస్థాయి రాయబారిని నియమించలేదు. తాజా విషయానికొస్తే.. పంజాబ్‌లోని తార్న్ తారన్ జిల్లాలో ఇండియా-పాక్ సరిహద్దు ఉంది. ఇక్కడ శుక్రవారం ముగ్గురు పాక్ పౌరులు సరిహద్దు గుండా కంచెదాటి అక్రమంగా ఇండియాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. ఇది గుర్తించిన బీఎస్ఎఫ్ వారికి హెచ్చరికలు జారీ చేసింది. తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది. అయినప్పటికీ వారు ఇండియా వైపు వచ్చేందుకు ప్రయత్నించారు. అనేక హెచ్చరికలు చేసినప్పటికీ అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో బీఎస్ఎఫ్ జవాన్లు వారిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనల్లో ముగ్గురిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఒకడు తిరిగి వెనక్కి వెళ్లిపోయాడు. అయితే, తమ దేశ పౌరుల్ని బీఎస్ఎఫ్ జవాన్లు అక్రమంగా కాల్చి చంపారు అంటూ పాక్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరాయుధులైన వారిపై కాల్పులు జరిపారని ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో వివరణ ఇవ్వాల్సిందిగా కోరుతూ పాక్‌లో ఉన్న ఇండియా రాయబారికి సమన్లు జారీ చేసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆదేశించింది.

## పలు దేశాలతో భారత వైమానిక దళ ఎక్సర్‌సైజ్ తరంగ్ శక్తి 2026

**ముద్ర, డెస్క్**



ది ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ విమాన యుద్ధ విన్యాసాల రెండో ఎడిషన్ తరంగ్ శక్తి 2026ను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైమానిక దళాలకు చెందిన విమానాల భాగస్వామ్యంతో స్నేహభావానికి ప్రతీకగా చేపడుతున్నారు. ఈ విన్యాసాల థీమ్ 'పవర్ ఇన్ పార్ట్‌నర్‌షిప్, ట్రస్ట్ ఇన్ ది స్కై'. ఈ విన్యాసాలు సెప్టెంబర్ 26వ తేదీన ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 12వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ విన్యాసాల్లో యూఎస్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, గ్రీస్, యూఏఈ, శ్రీలంక, బంగ్లాదేశ్ పాల్గొంటున్నాయి. ఇంకో 32 దేశాలు ఈ విన్యాసాలను పరిశీలిస్తున్నాయి. అమెరికాకు చెందిన ఐదో జనరేషన్ ఎయిర్‌క్రాఫ్ట్ యుద్ధ విమానం ఈ విన్యాసాల్లో పాల్గొనడం విశేషం. ఈ విమానం భారత వైమానిక స్థావరం నుంచి భారత వైమానిక దళంతో కలిసి ఒక విన్యాసంలో పాల్గొనడం ఇదే మొదటిసారి. భారత వైమానిక దళ అగ్రశ్రేణి యుద్ధ విమానాలైన రఫేల్, సుఖోయ్ మిరేజ్ 2000, జాగ్వార్, MiG-29, ఇండిజినస్ తేజ ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. అలాగే విదేశాలకు చెందిన ఫ్రెంచ్ రఫేల్ ఫైటర్స్, A400M ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్, MRIT ఏరియల్ రీఫ్యూయలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్, యూఏఈ F-16s, జర్మనీ యూరోఫైటర్స్ టైఫూన్స్ యుద్ధ విమానాలు కూడా ఆకర్షణగా నిలిచాయి. వివిధ దేశాల మధ్య వాయుసేనల పరస్పర సహకారం మెరుగుపరచడం, సంయుక్త వ్యూహాత్మక పోరాటం, వాయు రక్షణ, ఆకాశంలోనే ఇంధనం నింపుకోవడం భారతదేశ స్వదేశీ రక్షణ సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడం ఈ విన్యాసాల ఉద్దేశం అని వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ పేర్కొన్నారు.

# ఆ దాడి ఉగ్రవాదుల చర్యే..!

**ఫ్లైదుబాయ్ విమానంలో పైలట్‌పై కోపైలట్ దాడి ఉగ్రవాదుల చర్య అని ధృవీకరణ**

**ముద్ర, డెస్క్**



ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న విమానంలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై సహ పైలట్ హమామ్ అల్ హమామీ జరిపిన దాడి ఒక "ఉగ్రవాద చర్య" అని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాసిక్యూటర్లు శనివారం ధృవీకరించారు. విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకుని, దాన్ని కూల్చివేసేందుకు కో-పైలట్ కుట్ర పన్నినట్లు అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ బోయింగ్ 737 విమానం గాల్లో ఉండగా ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. విమానం సుమారు 34 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో కో-పైలట్ హమామ్ అల్ హమామీ తన ఉగ్ర ప్రణాళికను అమలు చేసేందుకు సిద్ధమయ్యాడు. కాక్‌పిట్‌లో ఉన్న 'క్రాష్ యాక్స్' తీసుకుని కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి దిగాడు. ఆ సమయంలో విమానం నియంత్రణ కోల్పోయి నిమిషానికి 23 వేల అడుగుల వేగంతో కిందకి పడిపోవడం ప్రారంభించింది. క్షణాల్లో 15,600 అడుగుల ఎత్తుకు చేరుకుంది. అయితే ప్రాణాపాయ స్థితిలోనూ కెప్టెన్ స్మిత్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. కో-పైలట్‌తో పోరాడుతూనే కాక్‌పిట్ డోర్‌ను తెరిచారు. దాంతో విమాన సిబ్బంది, ప్రయాణికులు వెంటనే స్పందించి కో-పైలట్‌ను పట్టుకుని బంధించారు. ఆ సమయంలో విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్ల సాయంతో కెప్టెన్ స్మిత్ విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ నగరంలో సురక్షితంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. కెప్టెన్ సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై యూఏఈ అటార్నీ జనరల్ హమద్ సైఫ్ అల్ షమ్సీ ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. ఈ దాడి వెనుక ఉన్న ఉగ్రవాద సంబంధాలపై ప్రత్యేక బృందం విచారణ జరుపుతున్నది. నిందితుడు హమామ్ అల్ హమామీ సొంత దేశమైన ఒమన్‌లోనే తీవ్రవాద భావజాలం కారణంగా విమానాలు నడపకుండా నిషేధానికి గురైనట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. చాలాకాలం సిరియాలో గడిపిన హమామ్, అక్కడ ఉగ్రవాద భావజాలానికి ఆకర్షితుడై, ఆ తర్వాత యూఏఈకి వచ్చినట్లు తెలుస్తోంది. కేవలం 8 నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరిన హమామ్, అంతకుముందు ఒమన్ ఎయిర్, రాయల్ ఎయిర్ మరోక్ సంస్థల్లో పనిచేశాడు. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల ముందు అతని సోషల్ మీడియా ఖాతాల్లో ఉగ్రవాదానికి సంబంధించిన పోస్టులు కనిపించాయి. ఇజ్రాయెల్ విమానాన్ని జూమ్ చేస్తూ తీసిన వీడియో, అల్‌ఖైదా నాయకుడు అల్-జవహరీ చిత్రాలు, మక్కా, మదీనా, జెరూసలేం పవిత్ర స్థలాలతో కూడిన ఏఐ-జనరేటెడ్ చిత్రాన్ని పోస్ట్ చేయడం అతని ఉగ్రవాద ఆలోచనా విధానానికి అద్దం పడుతున్నది.

## అమెరికాలోని ఓహియోలో హిందూ ఆలయంపై దాడి



**ముద్ర, న్యూయార్క్:** అమెరికాలోని ఓహియో రాష్ట్రంలో ఉన్న ఓ హిందూ ఆలయంపై దాడి జరిగింది. ఆ ఆలయంపై ఇటుకలతో అటాక్ చేసినట్లు హిందూ అమెరికన్ ఫౌండేషన్ పేర్కొన్నది. రిచ్‌మండ్ హైయిట్స్‌లో ఉన్న శ్రీ స్వామినారాయణ్ వడ్తల్ ధామ్ హిందూ మందిర్‌పై దాడి జరిగినట్లు తన ఎక్స్ అకౌంట్‌లో ఆ ఫౌండేషన్ పేర్కొన్నది. ఇటుకలతో దాడి చేయడం వల్ల ఆలయంలో డ్యామేజ్ జరిగింది. మరో వైపు అమెరికాలో ఉన్న భారతి సంతతి ప్రజలపై ఇటీవల దాడులు పెరిగిన విషయం తెలిసిందే. ఆలయం సమీపంలో ఉన్న నిఘా వీడియోను పరిశీలిస్తున్నామని అధికారులు చెప్పారు. గుడి పెద్దలతో టచ్‌లో ఉన్నట్లు ఫౌండేషన్ పేర్కొన్నది. గుడిలో పూజారులు, భక్తులు ఉన్న సమయంలోనే ఇటుకలతో దాడి జరిగినట్లు తెలిసింది. అయితే ఆ దాడిలో ఆలయంలోని కిటికీలు దెబ్బతిన్నాయి.

# 'కారణం తెలుపకుండానే బ్రేకప్ చెప్పాడు'

**ఎలాన్ మస్క్ లైఫ్ పార్ట్‌నర్ భావోద్వేగం..!**

**ముద్ర, డెస్క్**

టెస్లా సీఈఓ ఎలాన్‌మస్క్ వ్యక్తిగత బంధం మరోసారి వార్తల్లో నిలిచింది. తన ప్రస్తుత భాగస్వామి శివోన్ జిలిస్ నుంచి ఆయన విడిపోయారు. ఎలాంటి కారణం చెప్పకుండా, బ్రే కప్ గురించి ముందుగా ఎలాంటి చర్చలేకుండా మస్క ఆమెతో బంధాన్ని తెంచుకున్నాడు. ఈ విషయాన్ని శివోన్ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా లో ఓ భావోద్వేగ పోస్టు పెట్టారు. ఈ పోస్టు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ముందుగా ఎలాంటి చర్చలేకుండా వారంరోజల్లోనే ప్రేమలో నుంచి బయటకు వచ్చేయడం చాలా కష్టమని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. కానీ కొన్ని పరిసితులు ఇలాగే ఉంటాయని, తనకు ఎంతో బాధగా ఉందనీ తెలిపారు. ఎలాన్ మస్క్‌ను ఉద్దేశిస్తూ అంటే తనకు చాలా ఇష్టమని, ఆయన ఎన్నో జన్మలకు సరిపడా జ్ఞానాన్ని నేర్పించి, తన జీవితానికి ఒక అర్థాన్ని ఇచ్చారని వెల్లడించారు. ఎలాన్ సంతోషాన్ని తాను ఎల్లప్పుడూ కోరుకుంటానని పేర్కొన్నారు. ఈ ప్రపంచానికి ఆయన ఒక వరమని చెప్పారు. బయట ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొన్నా.. ఇంట్లో ఆయన ప్రశాంతంగా ఉండేలా తాను, తన పిల్లలు చూసుకున్నామని శివోన్ పేర్కొన్నారు. మస్క్‌తో బంధం నుంచి దూరం కావడం తనకు లోటేనని ఆవేదన వెలిబుచ్చారు. తాము మంచి స్నేహితులుగా ఉండి, పిల్లలకు తోడుగా ఉంటామని ఆశిస్తున్నట్లు ఆశాభావం వ్యక్తంచేశారు. కాగా శివోన్ జిలిస్ యేల్ యూనివర్సిటీలో విద్యనభ్యసించారు. ఓపెన్‌ఏఐలో పనిచేసిన సమయంలో మస్క్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. అప్పటి నుంచి వారు సహజీవనం చేస్తున్నారు. 2017లో మస్క్ ఆధ్వర్యంలోని న్యూరాలింక్ ప్రాజెక్టులో ఆమె చేరారు. ఆ ప్రాజెక్టు కింద మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చే ప్రయోగాలు చేస్తున్నారు. ఆ సంస్థలో ఆమెది డైరెక్టర్ హోదా. కెనడాలో పెరిగిన శివోన్‌కు భారతీయ మూలాలున్నాయి. ఆమె తల్లి పంజాబీ. మస్క్-శివోన్‌కు నలుగురు సంతానం. 2021 నవంబర్‌లో ఐవీఎఫ్ ద్వారా ఆమె కవల పిల్లలకు జన్మనిచ్చారు. తర్వాత మరో ఇద్దరు పిల్లలు జన్మించారు. వారిలో ఒక కుమారుడి పేరులో శేఖర్ పదం ఉంటుంది. భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం ఈ పేరు పెట్టినట్లు గతంలో ఓ సందర్భంలో మస్క్ చెప్పారు.




Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555